



సి. బెళగల్ మండలం కె. సింగవరం డీసిల్టేషన్ రీచ్‌లో ఇసుక తవ్వకాలు

- సీనరేజ్, జీఎస్టీని పూర్తిగా రద్దు చేసిన ప్రభుత్వం
- పట్టా భూముల్లో ఎవరి ఇసుక వారికే సొంతం
- దీపావళి నుంచి ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు
- టీడీపీ ప్రభుత్వం కీలక నిర్ణయం

ఇసుక ఫ్రీ



కర్నూలు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణదారులు.. నిర్మాణ కార్మికులకు సీఎం చంద్రబాబు శుభవార్త చెప్పింది. ఇక నుంచి ఇసుకపై సీనరేజ్, జీఎస్టీ చార్జీలు రద్దు చేస్తూ మంత్రివర్గం కీలక నిర్ణయం తీసుకుంది. అంటే.. కేవలం నదిలో డీ-సిల్టేషన్ ద్వారా ఇసుక తవ్వే బోట్ యాజమానులకు మాత్రం తవ్విన చార్జీలు ఇవ్వాల్సి ఉంటుంది. గత వైసీపీ ప్రభుత్వం ఇసుక వ్యాపారానికి శ్రీకారం చుట్టి సంస్థలకు ఇసుక కాంట్రాక్ట్ ఇచ్చింది. దీంతో ఇసుక దొరకక.. ఒకవేళ దొరికినా ధర బంగారంతో పోటీ పడడంతో నిర్మాణ రంగం కుదేలైంది. టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చాక 'ఉచిత ఇసుక పాలసీ' తీసుకొచ్చింది. గ్రామాల అభివృద్ధి కోసం రాయల్టీ, లోడింగ్ చార్జీతో పాటు జీఎస్టీ కలసి టన్నులకు రూ.326 నిర్ణయించింది. అయితే.. టిప్పర్ యాజమానులు సిండికేట్‌గా ఏర్పడి ఇష్టారాజ్యంగా 20 టన్నుల ఇసుక రూ.24-25 వేలకు పైగా విక్రయించారు. గత ప్రభుత్వం కంటే ధర ఎక్కువ ఉండడంతో ప్రభుత్వానికి చెడ్డ పేరు రావడం మొదలైంది. రాష్ట్ర వ్యాప్తంగా ఇదే పరిస్థితి ఉండడంతో ఎట్టకేలకు ప్రభుత్వం సకాలంలో మేల్కొంది. సీనరేజ్, జీఎస్టీ రద్దు చేస్తూ.. ఉచిత ఇసుక పాలసీ పక్కాగా అమలుకు బుధవారం సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన మంత్రివర్గం కీలక నిర్ణయం తీసుకుంది. అలాగే.. దీపావళి నుంచి ఏడాది ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు ఇచ్చే దీపం పథకానికి కూడా ఆమోదం తెలిపింది. జిల్లాలో తెల్ల రేషన్ కార్డు ఉన్న 6.76 లక్షల మందికి ప్రయోజనం కలుగనుంది.

తుంగభద్ర నదిలో వరద ప్రవాహం ఉండడంతో ప్రస్తుతం సి. బెళగల్ మండలం కొత్త కోట, కె. సింగవరం, పల్లెదొడ్డి, ముడుమాల, ఈర్ల దిన్నె వద్ద డీ-సిల్టేషన్ రీచుల్లోనే ఇసుక తవ్వకాలు చేస్తున్నారు. కర్నూలు, నంద్యాల జిల్లాలకు ఇక్కడి నుంచి సరఫరా చేయాల్సి ఉంది. గత వైసీపీ ప్రభుత్వం డీ-సిల్టేషన్ రీచ్‌ల్లో టన్ను రూ.625 వసులు చేశారు. రవాణ చార్జీలు, లోడింగ్ చార్జీలు సరేసరి. టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చాక ఉచిత ఇసుక పాలసీ తీసుకొచ్చింది. స్థానిక సంస్థల ఆర్థిక బలోపేతం కోసం రాయల్టీ, జిల్లా మినరల్ ఫండ్ (డీఎంఎఫ్), మెరిట్ చార్జీలు మాత్రం టన్నుకు రూ.89, లోడింగ్, రవాణా చార్జీలు, జీఎస్టీ కలిపి టన్నుకు రూ.326 నిర్ణయించారు. వైసీపీ ప్రభుత్వంలో పోలిస్తే టన్నుకు రూ.299 తగ్గించారు. ఇసుక సరఫరాలో రెవిన్యూ, పోలీసు, మైనింగ్ అధికారుల మధ్య సమన్వయ లోపం, ఇసుక రవాణ టిప్పర్ యజమానులు సిండికేట్‌గా ఏర్పడి ఇష్టారాజ్యంగా ధర పెంచడంతో గత ప్రభుత్వం కంటే ఎక్కువ ధర వసులు చేస్తున్నారని భవన నిర్మాణదారులు ఆరోపించారు. దీంతో ప్రభుత్వం సీనరేజ్, జీఎస్టీ రద్దు చేసింది. ఇక నుంచి కేవలం తుంగభద్ర నదిలోలో డీ-సిల్టేషన్ ద్వారా ఇసుక తవ్వకం ఖర్చు, లోడింగ్ చార్జీలు కలిపి టన్నుకు రూ.100-120కు మించదు. ఈ లెక్కన 20 టన్నుల ఇసుక కర్నూలుకు చేర్చాలంటే రవాణా చార్జీలు, డ్రైవర్ బత్తాతో కలసి 20 టన్నులు టిప్పరు రూ.10-11 వేలకు మించదని అంచనా. ప్రస్తుతం టిప్పరు రూ20 వేలకు పైగా అమ్ముతున్నారు. అంటే.. ఈ కొత్త ఇసుక పాలసీ వల్ల దాదాపు రూ.9-10 వేలు వినియోదారుడికి ఆదా అవుతుందని అంచనా వేస్తున్నారు. అయితే.. రాజకీయ నేతల జోక్యం, టిప్పర్ యాజమానులు సిండికేట్ కాకుండా పారదర్శకంగా ఇసుక రవాణా చేస్తేనే ఇది సాధ్యం. లేదంటే.. ఉచిత ఇసుక పేరిట అక్రమార్కులు ఇష్టారాజ్యంగా దోపిడీ చేసే ప్రమాదం లేకపోలేదు.



'దీపం' కాంతులతో దీపావళి

టీడీపీ కూటమి ప్రభుత్వ అమలు చేస్తామన్నా సూపర్ సిక్స్ హామీల్లో ఒకటైన ఏడాదికి ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేసే దీపం పథకం ఈ దీపావళి నుంచి అమలుకు చంద్రబాబు ప్రభుత్వం మంత్రివర్గం ఆమోదం తెలిపింది. అయితే.. విధివిధానాలు రావాల్సి ఉంది. తెల్ల రేషన్ కార్డు కలిగిన లబ్ధిదారులకు ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇచ్చే అవకాశం ఉందని సివిల్ సప్లయ్ అధికారులు భావిస్తున్నారు. అదే జరిగితే జిల్లాలో 6.76 లక్షల తెల్ల రేషన్‌కార్డు లబ్ధిదారులకు ఏడాది మూడు సిలిండర్లు ఇంటికి ఉచితంగా రానున్నాయి. దాదాపు రూ.2,500 ప్రకారం రూ.169 కోట్లు ఆర్థిక ప్రయోజనం చేకూరుతుందని అంచనా వేస్తున్నారు.



పకడ్బందీగా ఉచిత ఇసుక విధానం

- గ్రూపులుగా ఏర్పడి వ్యాపారం చేస్తే చర్యలు
- రీచ్‌ల వద్ద కాకుండా ఎక్కడి నుంచైనా తీసుకెళ్లవచ్చు
- కలెక్టర్, ఎస్పీ, మైనింగ్ అధికారులకు మంత్రి టీజీ ఆదేశం

కర్నూలు అర్బన్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ఉచిత ఇసుక విధానం పకడ్బందీగా అమలు చేయాలని మంత్రి టీజీ భరత్ ఆదేశించారు. బుధవారం అమరావతి నుంచి కలెక్టర్ రంజిత్ బాషా, ఎస్పీ బిందు మాధవ్, మైనింగ్ డీడీ రవిచంద్ర లతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జిల్లాలో ప్రజలకు ఉచిత ఇసుక అందివ్వడమే లక్ష్యంగా పని చేయాలని సూచించారు. ఈ ప్రక్రియలో ఇసుకను రీచ్‌ల వద్ద నుంచే కాకుండా ఎక్కడి నుంచైనా తీసుకెళ్ల వచ్చని పేర్కొన్నారు. నదీ సమీప గ్రామాలు, పట్టణాలకు చెందిన వారు తమ నిర్మాణ అవసరాలకు ఇసుకను తవ్వి ఎద్దుల బండ్లు, ట్రాక్టర్ల ద్వారా ఉచితంగా ఇసుకను తీసుకెళ్ల వచ్చన్నారు. ఇసుకను తీసుకెళ్లేందుకు ప్రజలపై భారం తగ్గుతుందన్నారు. తక్కువ ధరకే ఇసుక లభ్యమయ్యే పరిస్థితులు కల్పించినట్లు మంత్రి తెలిపారు. ఎక్స్‌కవేటర్‌లతో ఇసుకను తవ్వి నిలువ చేసుకొని డబ్బు సంపాదించాలని చూస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రూపులుగా ఏర్పడి ఇసుక కొరత సృష్టించి వ్యాపారం చేయాలనుకుంటే చూస్తూ ఊరుకోబోమన్నారు. ఉచిత ఇసుక విధానంపై ప్రజలు సంతృప్తి వ్యక్తం చేసే పరిస్థితి తీసుకొస్తామని అన్నారు. ఇసుకను తవ్వి సరిహద్దులు దాటించి అమ్ముకునే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు.



మాడవీధుల్లో కొనసాగుతున్న స్వర్ణరథం

స్వర్ణ రథంపై మల్లన్న విహారం

శ్రీశైలం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం మహాక్షేత్రంలో భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి బుధవారం స్వర్ణరథంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని మల్లికార్జున స్వామికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అన్నాభిషేకం, విశేష పూజలను అర్చకులు నిర్వహించారు. అనంతరం స్వర్ణరథాన్ని పుష్పాలతో అలంకరించి ఉత్సవమూర్తులను కొలువుదీర్చారు. అనంతరం ఆలయమహాద్వారం నుంచి నాలుగు మాడవీధుల్లో స్వర్ణరథోత్సవ వేడుకను భక్తుల శివనామస్మరణ నడుమ వైభవంగా జరిపారు. స్వర్ణరథం సాగుతుండగా కోలాటం, జానపద కళారూపాలు భక్తులను ఆకట్టుకున్నాయి. ఆలయ ఈఓ చంద్రశేఖరరెడ్డి, అర్చకులు ఉత్సవాన్ని పర్యవేక్షించారు.



భక్తుల శివనామస్మరణల నడుమ వైభవంగా స్వర్ణ రథంపై ఆదిదేవుడి విహారం

డ్రోన్ హబ్‌గా ఓర్వకల్లు

- 300 ఎకరాల కేటాయింపునకు సీఎం అంగీకారం
- హర్షం వ్యక్తం చేసిన పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత



కల్లూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబునాయుడు ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న ఓర్వకల్లు ఇండస్ట్రియల్ కారిడార్ త్వరలో డ్రోన్ హబ్‌గా మారనుంది. మంగళవారం అమరావతిలో జరిగిన డ్రోన్ సమ్మిట్‌లో భాగంగా ఓర్వకల్లు మండలంలో డ్రోన్ హబ్ కోసం మూడు వందల ఎకరాలు కేటాయిస్తున్నట్లు సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. బుధవారం మాధవీనగర్‌లోని తన స్వగృహంలో పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరిత మాట్లాడుతూ 2014లో టీడీపీ ప్రభుత్వం ఓర్వకల్లును ఇండస్ట్రియల్ కారిడార్‌గా ఏర్పాటు చేస్తూ సీఎం చంద్రబాబునాయుడు చర్యలు తీసుకున్నారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం సహకారంతో విమానాశ్రయం, రెండవ అతిపెద్ద సోలార్ పార్క్, పరిశ్రమల స్థాపనకు శ్రీకారం చుట్టారని అన్నారు. 2024 ఎన్నికల్లో గెలిచిన అనంతరం ఓర్వకల్లు పారిశ్రామిక అభివృద్ధికి సీఎం చంద్రబాబునాయుడు కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించి రూ.2860 కోట్లు మంజూరు చేయించారని గౌరుచరిత కొనియాడారు. డ్రోన్‌హబ్ వల్ల ఎంతోమంది నిరుద్యోగ యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని తెలిపారు. టెక్నాలజీని అన్ని రంగాలకు అనుసంధానం చేస్తూ విప్లవాత్మక మార్పులకు సీఎం శ్రీకారం చుట్టారని పేర్కొన్నారు. ఇరిగేషన్ ప్రాజెక్టులు, వాటర్ పైపులైన్‌లో సాంకేతిక సమస్యల పరిశీలన, ప్రకృతి విపత్తుల్లో డ్రోన్ సాయంతో బాధితులకు సాయం అందించడం, రక్షణరంగం, విద్యా, వైద్యం ఇలా అన్నిరంగాల్లో డ్రోన్‌తో సేవలు పొందవచ్చని ఆమె అన్నారు.



మంత్రాలయం వద్ద పరవళ్లు తొక్కుతున్న తుంగభద్ర

తుంగభద్రమ్మ పరవళ్లు

మంత్రాలయం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాల మధ్య ప్రవహిస్తున్న తుంగభద్ర నది ఉగ్రరూపం దాల్చింది. మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠం వద్ద తుంగభద్ర నది వరదనీటితో ఉధృతంగా పరవళ్లు తొక్కుతూ ప్రవహిస్తోంది. బుధవారం సాయంత్రం మంత్రాలయం వద్ద 311.500 మీటర్ల నీటి మట్టంతో 1.11 లక్షల క్యూసెక్కుల మేర నీటి ప్రవాహం కొనసాగింది. రెండు రాష్ట్రాల సరిహద్దులను తాకుతూ పరవళ్లు తొక్కుతుంది. మంత్రాలయం రాఘవేంద్ర స్వామి దర్శనార్థం వచ్చి నదిలో పుణ్యస్నానాలు ఆచరించే భక్తులకు శ్రీమఠం అధికారులు మైకుల ద్వారా హెచ్చరికలు జారీ చేస్తున్నారు. తీర ప్రాంతంలో గజ ఈతగాళ్లతో పోలీసులు పహారా కాస్తున్నారు.



ఘోరం

- మలిపెళ్లికి వెళుతూ పరలోకానికి..
- ఇన్నోవాను ఢీకొన్న ఆర్టీసీ బస్సు
- అన్నమయ్య జిల్లా రైల్వేకోడూరు సమీపంలో ప్రమాదం
- ముగ్గురు కర్నూలు వాసులు మృతి

వివరాలు 7లో...

వంద శాతం అమలు చేయాలి

- కలెక్టర్ పి. రంజిత్ బాషా



కర్నూలు కలెక్టరేట్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆస్పిరేషనల్ బ్లాక్స్ (హొళగుంద, మద్దికెర, చిప్పగిరి) మండలాల్లో నిర్దేశించిన 40 సూచికను సంతృప్తి స్థాయిలో వంద శాతం అమలు చేయాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో ఆస్పిరేషనల్ బ్లాక్స్ పురోగతిపై కలెక్టర్ సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యశాఖ గర్భిణీల నమోదు, ఆసుపత్రుల్లో ప్రసవాలు, బరువు తక్కువగా పుట్టిన పిల్లల వాతం, మధుమేహం పరీక్షలు, హైపర్‌టెన్షన్ పరీక్షలు తదితర అంశాలను వంద శాతం సాధించారని, ఈ వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడు చేయాలని డీఎంహెచ్‌వోను ఆదేశించారు.

ఎస్డీజీ ట్రాకింగ్ యాప్ అమలుపై త్వరలో శిక్షణ: సస్టైనబుల్ డెవలప్‌మెంట్ గోల్స్‌ను క్షేత్రస్థాయిలో ట్రాకింగ్ చేసేందుకు ఒక యాప్ రూపొందించినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ యాప్ అమలుపై క్షేత్రస్థాయి అధికారులకు పది రోజుల్లో శిక్షణ ఇవ్వనున్నామని పేర్కొన్నారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, సీపీవో హిమప్రభాకర్ రాజు, డీఎంహెచ్‌వో డా.భాస్కర్, ఐసీడీఎస్ పీడీ విశ్వనాథ్, ఆస్పిరేషనల్ బ్లాక్స్ మండలాల అధికారులు పాల్గొన్నారు.



పెద్ద నాణెంపై చిన్న చూపు..!

- రూ.10 కాయిన్‌పై వదంతులు
- అవగాహన కల్పించినా అనాసక్తి

6

2 నుంచి శ్రీశైలంలో కార్తీక మాసోత్సవాలు

- 16 రోజుల పాటు ఆర్జిత సేవలు నిలుపుదల

6

ఎస్సార్బీసీ సబ్ కెనాల్‌కు గండి

కోవెలకుంట్ల, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): కోవెలకుంట్ల మండలంలోని గుంజలపాడు రహదారిలోని పదోబ్లాక్ ఎస్సార్బీసీ సబ్ కెనాల్‌కు బుధవారం గండిపడింది. ఈ కాల్వకు గండి పడడంతో కాల్వ వెంట వచ్చే నీరు పొలాల్లోకి ప్రవహిస్తోంది. వేసవికాలంలో కాల్వలను పర్యవేక్షించాల్సిన ఎస్సార్బీసీ అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదు. దీంతో సాగునీటి కాల్వలో ముళ్లకంపలు, పూడికలతో నిండిపోయాయి. ప్రస్తుతం వర్షాలకు తోడు ఎస్సార్బీసీకి నీటిని వదలడంతో పదోబ్లాక్ కాల్వ బలహీనమై గండిపడింది. దీంతో అమడాల , చింతకుంట, కోవెలకుంట్ల, పొట్టిపాడు, గుంజలపాడు గ్రామాల పరిధిలోని పంటలు నీట మునిగాయి.


పదో బ్లాక్ సబ్ కెనాల్ వద్ద గండిపడి వృథాగా పోతున్న నీరు

పోటెత్తిన వరద

కోసిగి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కోసిగి మండల పరిధిలోని అగసనూరు గ్రామంలోని తుంగభద్ర నదిపై ఉన్న ఆర్డీఎస్ ఆనకట్టకు బుధవారం భారీగా వరద నీరు పోటెత్తింది. టీబీ డ్యాం నుంచి 25 గేట్లు ఎత్తి తుంగభద్ర నదికి 1,12,136 క్యూసెక్కుల మేర నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఇప్పటికే ఆర్డీఎస్ ఆనకట్టకు ఎగువ కురుస్తున్న వర్షాల వల్ల భారీగా నీరు చేరుతోంది. దీనికి తోడు తుంగభద్ర డ్యాం నుంచి నీరు విడుదల కావడంతో ఆర్డీఎస్ ఆనకట్టకు వరద పోటెత్తుతోంది.


అగసనూరు గ్రామంలో ఆర్డీఎస్ ఆనకట్టపై పొంగి ప్రవహిస్తున్న వరద

పెద్ద నాణెంపై చిన్నచూపు..!

- రూ.10 కాయిన్‌పై వదంతులు
- అవగాహన కల్పించినా అనాసక్తి

మద్దికెర, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): పది రూపాయల నాణేనికి పెద్ద కష్టం వచ్చింది. ఆ నాణెం చెల్లదన్న అపోహ, వదంతులు ప్రజల్లో పాతుకుపోవడంతో ఆ నాణెం వినియోగంలో కనుమరుగైపోతోంది. నాణెం చెల్లదన్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టేందుకు కొన్నేళ్లుగా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్బీఐ) శతవిధాలా ప్రయత్నిస్తున్నా సత్ఫలితాలు రావడం లేదు. రూ.10 నాణెలను తీసుకోవాలని, ఎవరూ నిరాకరించకూడదని ఆర్బీఐ స్పష్టం చేస్తోంది. ఎవరైనా చెలామణిని అడ్డుకుంటే శిక్షార్హులవుతారని కూడా ఇప్పటికే పలుమార్లు ఆర్బీఐ హెచ్చరించింది. ప్రస్తుతం వ్యాపారులు, పెట్రోల్ బంకుల నిర్వాహకులు రూ.10 నాణెం తీసుకోవడం లేదు. తమకు వచ్చిన నాణేలను తిరిగి ప్రజలకు ఇస్తే తీసుకోవడం లేదని వ్యాపారాలు చెబుతున్నారు. ఒక పక్క ఈ నాణెం చెల్లుతుందని ఆర్‌బీఐ చెబుతున్నా వ్యాపారులు, ప్రజలు తీసుకోవడానికి నిరాకరిస్తున్నారు. ఐదేళ్ల క్రితం ఆర్‌బీఐ రూ.10 నోట్ల స్థానంలో వీటిని అందుబాటులోకి తీసుకువచ్చింది. కొంత కాలం ఈ నాణేలపై ఎలాంటి అభ్యంతరాలు లేకపోయినా వ్యాపారులు తీసుకునేందుకు విముఖత చూపుతున్నారు. ఇటీవల ఈ నాణెం చెల్లుబాటు అవుతుందని రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా స్పష్టం చేసింది. బ్యాంకర్లు తిరస్కరిస్తే ఎల్‌డీఎంకు, ఆయా బ్యాంకు ఉన్నతాధికారులు ఫిర్యాదు చేసే అవకాశం కల్పించింది. వాణిజ్య సముదాయాల్లో నాణేలను తీసుకోకపోతే నేరుగా పోలీసులకు ఫిర్యాదు చేయవచ్చని తెలిపింది.



వదంతులు నమ్మకండి



మార్కెట్‌లో రూ.10 అది చెల్లదనే అపోహ ప్రజల్లో బలంగా ఉంది. వందశాతం ఆ నాణెం చెల్లుబాటు అవుతుంది. వాస్తవానికి ఈ వదంతులు ఎలా మొదలైందో తెలియదు కానీ ప్రజల్లో మాత్రం చెల్లదంటూ పీక్సయ్యారు. అది ఎంతమాత్రం సబబు కాదు. కూరగాయల వ్యాపారులు, చిన్న చిన్న హోటళ్లు, బజ్జీ కొట్టు వద్ద రూ.10 నాణెం చెల్లదనే అపోహ పెట్టుకోవద్దు. రూ.10 నాణెం తీసుకోవాలని మేము కూడా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కరపత్రాల ద్వారా ప్రజలకు వివరిస్తాం.

- జి.వెంకటేశ్‌గౌడు, కెనరా బ్యాంకు మేనేజర్, మద్దికెర

ప్రజలకు అవగాహన కల్పించాలి



రూ.10 నాణెం చెల్లుతుందని బ్యాంకర్లు ప్రజల్లో అవగాహన కల్పించాలి. రూ.10 నాణెం మేము తీసుకుంటున్నాం. మా వద్ద నుంచి తీసుకోవడానికి ప్రజలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ నాణెంపై సభలు పెట్టి లేకపోతే దండోరా ద్వారా ప్రజలకు వివరించాలి. అప్పుడే నాణేలపై ప్రజలకు అవగాహన వచ్చి తీసుకుంటారు.


- ముత్యాల రాజశేఖర్, మద్దికెర

పల్లెల్లో దండోరా వేయించాలి :



గ్రామీణ ప్రాంతాల్లో నేటి వరకు రూ.10 నాణెం అంటే చెల్లదనే అపోహ ఉంది. రూ.10 నాణేం చెల్లుతుందని విస్తృత ప్రచారం చేయాలి. బ్యాంకర్లు దండోరా ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలి. మేము వేరే వారికి పది రూపాయల నాణెం ఇచ్చేందుకు వెళ్తే వారు తీసుకోవడం లేదు. ఇలా ఉంటే ఎవరికైనా అనుమానం వస్తుంది.

- విజయలక్ష్మి, కొత్తపల్లి





కాయిన్ కాదంటే చెరసాలే..!

ఆర్బీఐ పది రూపాయల నాణేలు నిషేధించిందని, నకిలీవి పుట్టుకొచ్చాయని వచ్చిన వదంతులను నమ్మకూడదు. రూ.10కాయిన్‌లను తిరస్కరిస్తే చెరసాలే. వాటిని వస్తు క్రయ విక్రయాలు, బ్యాంకు ఖాతాల్లోనూ డిపాజిట్ చేసుకోవచ్చు. ఎవరైనా సరే నాణేలను స్వీకరించకపోతే 2011 సెక్షన్ 61 ప్రకారం చట్ట ఉల్లంఘన కింద పరిగణిస్తారు. ఆర్బీఐ 2005 నుంచి రూ.10 నాణేలను అందుబాటులోకి తెచ్చింది. వివిధ రూపాల్లో ఇవి ప్రజల దరి చేరాయి.

బాబోయ్.. ఇవేం ధరలు..?

చాగలమర్రి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కూరగాయల ధరలు భగ్గుమంటున్నాయి. సామాన్యులు కొనలేనంతగా ధరలు పెరిగాయి. దీంతో కిలో కొనేవాళ్లు అరకిలో, పావుకిలోతో సరిపెట్టుకుంటున్నారు. చాగలమర్రి మార్కెట్‌లో బుధవారం చిక్కుడు కాయలు కిలో రూ.100, బీన్స్ కిలో రూ.140, క్యారెట్ రూ.100, క్యాప్సికం కిలో రూ.100, బెండకాయలు రూ.80, వంకాయలు రూ.80, బంగాళ దుంపలు రూ.80, కాకరకాయ రూ.100, పచ్చిమిర్చి 80 నుంచి రూ.100, చౌకకాయలు రూ.80, టమోటా రూ.60, అల్లం కిలో రూ.120, అనందలు కిలో రూ.100, మునగ కిలో రూ.160 ధర పలుకుతుండటంతో సామాన్యులు కొనలేని పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం చొరవ తీసుకుని కూరగాయల ధరలను అదుపు చేసి ఆదుకోవాలని పేద, మధ్యతరగతి ప్రజలు కోరుతున్నారు.



మల్లికార్జునస్వామికి వెండి సమర్పణ

శ్రీశైలం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం మల్లికార్జున స్వామికి బుధవారం హైదరాబాద్‌కు చెందిన అద్దంకి నరసింహారావు, హరిత వెండి వస్తువులను సమర్పించారు. ఇందులో 995 గ్రాముల బరువుగల రెండు వెండి బిందెలు, 1.665 కిలోల గంధాక్షరి గిన్నెలను అందజేశారు. వీటిని అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ఆశీర్వచన మండపంలో పర్యవేక్షకులు కె. అయ్యన్న, అమ్మవారి ఆలయం ఇన్‌స్పెక్టర్ మల్లికార్జున, గుమస్తా సావిత్రికి దాతలు అందజేశారు. అనంతరం దాతకు వేదపండితులు వేదాశీర్వచనం పలికి తీర్థప్రసాదాలను అందజేసి స్వామి, అమ్మవార్ల శేషవస్త్రాలు, ప్రసాదాలను అందజేశారు.


విరాళంగా అందజేసిన వెండి వస్తువులు

నర్సుల ఎన్నికల్లో శాంతి భవానీ ప్యానల్ విజయం

- అధ్యక్షురాలిగా ఎం.లీలావతి, కార్యదర్శిగా సి. బంగారి
- అభినందనలు తెలిపిన ఏపీఎన్జీవో, టీఎన్‌టీయుసీ నాయకులు

కర్నూలు హస్పిటల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లా ఏపీ గవర్నమెంట్ నర్సెస్ అసోసియేషన్ ఎన్నికల్లో ఏపీఎన్జీవో, టీఎన్‌టీయుసీ బలపరిచిన శాంతిభవానీ ప్యానల్ అన్ని పోస్టుల్లో ఘన విజయం సాధించింది. బుధవారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కర్నూలు మెడికల్ కాలేజీ ఆడిటోరియంలో జిల్లా ఎన్నికల అధికారి బి. చెన్నమ్మ ఆధ్వర్యంలో ఎన్నికలు జరిగాయి. 321 మంది సభ్యులు ఉండగా.. 270 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. అనంతరం సాయంత్రం 6.30 గంటలకు పోలీసు బందోబస్తు ఆధ్వర్యంలో కౌంటింగ్ ప్రక్రియ రాత్రి 8.30 గంటల వరకు సాగింది. అనంతరం జిల్లా ఎన్నికల అధికారి విజేతలను ప్రకటించి వారికి డిక్లరేషన్ ఫామ్‌లను అందించారు. అధ్యక్ష పదవికి మండ్ల లీలావతికి 160 ఓట్లు రాగా, ఆదిలక్ష్మికి 98 ఓట్లు వచ్చాయి. కార్యదర్శి పదవికి సి. బంగారికి 152 ఓట్లు రాగా, డి. మంజులదేవికి 112 ఓట్లు వచ్చాయి. ఉపాధ్యక్షురాలిగా జి. శాంతిభవానికి 162 ఓట్లు రాగా, శ్రీదేవికి 97 ఓట్లు వచ్చాయి. కోశాధికారి పోస్టుకు ఎన్. లక్ష్మినరసమ్మ (గోనెగండ్ల పీహెచ్‌సీ)కి 143 ఓట్లు రాగా, జి.విజయమ్మకు 119 ఓట్లు వచ్చాయి. ఈసీ సభ్యులుగా ఎస్.సోమేశ్వరి, డి. కృష్ణవేణి, జే. ఉమారాణి, యుఎం శాంతిలత, ఏ.ఉమాదేవి గెలిచారు. గెలిచిన శాంతిభవాని ప్యానల్‌కు ఏపీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు వెంగళ్ రెడ్డి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు దస్తగిరిరెడ్డి, టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి అశోక్‌కుమార్, తెలుగునాడు ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాగరాజు, కర్నూలు, నంద్యాల జిల్లాల అధ్యక్షుడు మాధవరాజు, చంద్రశేఖర్ నాయుడు అభినందనలు తెలిపారు.


ప్యానల్‌ను అభినందిస్తున్న ఏపీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు వెంగళ్ రెడ్డి

కర్నూలు వాసికి అరుదైన అవకాశం

- ఖలీద్ సైపుల్లాకు కాంగ్రెస్‌లో కీలక పదవి

కర్నూలు అర్బన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రతిభను గుర్తించి కాంగ్రెస్ అల్ ఇండియా డేటా, టెక్నాలజీ (ఐఎన్‌సీ)విభాగానికి వైస్ ఛైర్మన్‌గా ఖలీద్ సైపుల్లాను ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నియమించారు. కర్నూలు నగరానికి చెందిన ఖలీద్ 20 సంవత్సరాలకు పైబడి సాఫ్ట్‌వేర్ రంగంలో ఉన్నారు. గూగుల్, ఇన్ఫోసిస్, నెస్, డేల్ వంటి ప్రముఖ సంస్థల్లో ఆయన పని చేశారు. డేటా శిక్షణ, టెక్నాలజీలపై ఆయనకు అపారమైన అనుభవం ఉంది. ఆయన రూపొందించిన మిస్సింగ్ ఓటర్ల యాప్, ఉచిత రేషన్, ఉచిత ఆక్సిజన్ యాప్ లాంటి కార్యక్రమాలు సీఎన్ఎన్, బీబీసీ, ఫారిన్ పాలసీ, బిజినెస్ స్టాండర్డ్, ఇండియన్ ఎక్స్‌ప్రెస్, ఎన్‌డీటీవీలో ప్రసారమయ్యాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన నియామకంపై సంతోషం వ్యక్తం చేశారు. లోక్ సభ ప్రతిపక్ష నేతగా రాహుల్ గాంధీ, ఐఎన్‌సీ డేటా అండ్ అనలిటిక్స్ విభాగం ఛైర్మన్ ప్రవీణ్ చక్రవర్తికి ధన్యవాదాలు తెలిపారు. రాజకీయ నేపథ్యం లేని వారు కూడా ప్రజా సేవల పట్ల ఆసక్తి ఉంటే కాంగ్రెస్ పార్టీలో అభివృద్ధి సాధించడానికి, మంచి అవకాశాలు ఉన్నాయని తెలిపారు. కాగా డీసీసీ అధ్యక్షుడు మురళీకృష్ణ, నగర అధ్యక్షుడు జిలాని బాషా, మహిళా విభాగం అధ్యక్షురాలు వెంకట సుజాత తదితరులు ఖలీద్‌కు అభినందనలు తెలిపారు.



సీఎంవో ఆదేశాలతో నిధులు


ఆర్‌డబ్ల్యూఎస్ ఎఈకి వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్థులు

ఆదోని రూరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి కార్యాలయ ఆదేశాలతో గణేకల్లుతో పాటు అయిదు గ్రామాల ప్రజల తాగునీటి కష్టాలను తీర్చేందుకు అధికారులు నిధులు మంజూరు చేశారు. ఈనెల 18వ తేదీన గ్రామానికి చెందిన విరూపాక్షి, రంగస్వామి, బంగారయ్య అమరావతిలో సీఎంవో ప్రజాపరిష్కార వేదికలో వినతిపత్రం అందజేశారు. నూతన పైపులైన్ ఏర్పాటుకు జిఓ నెం. 918 ద్వారా రూ.566.90 కోట్లు మంజూరైనట్లు టెండర్లు పిలిచి పనులు చేస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ ఎఈ మధు తెలిపారు. అయితే పనులు త్వరగా చేయాలని గ్రామస్థులు ఏఈకి వినతిపత్రం ఇచ్చారు.

2 నుంచి శ్రీశైలంలో కార్తీక ఉత్సవాలు

16 రోజుల పాటు ఆర్జిత సేవలు నిలుపుదల



శ్రీశైలం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం మహాక్షేత్రంలో నవంబరు 2 నుంచి డిసెంబరు 1 వరకు కార్తీకమాసోత్సవాలు ఘనంగా జరగనున్నాయి. క్షేత్రానికి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున రద్దీ రోజులు శని, ఆది, సోమవారాలు, పౌర్ణమి, ఏకాదశి, సెలవురోజుల్లో స్వామివారి స్పర్శదర్శనాలు, గర్భాలయ అభిషేకాలు, సామూహిక అభిషేకాలు నిలపుదల చేస్తున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. ప్రత్యేక రోజుల్లో స్వామివారి అలంకరణ దర్శనం మాత్రమే ఉంటుందన్నారు. రెండు విడతలుగా ఆర్జిత హోమాలు నిర్వహించనున్నారు. సాధారణరోజులు మొత్తం 14 రోజులలో స్వామివారి స్పర్శదర్శనాలు, సామూహిక అభిషేకాలను మూడు విడతలుగా నిర్వహించనున్నారు. భక్తులు దర్శనం టిక్కెట్లను దేవస్థానం వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ ద్వారా పొందవచ్చునని పేర్కొన్నారు.

సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ పిల్లర్‌కు మరమ్మతులు



నిర్మాణానికి ఐరన్ కడ్డీలు సిద్ధం చేస్తున్న ఇంజనీర్లు

కర్నూలు కల్చరల్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): కర్నూలు నగర శివారు మునగాలపాడు సమీపంలోని సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ పిల్లర్ కూలడానికి సిద్ధంగా ఉందని ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో 'ఎప్పుడైనా కూలవచ్చు' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి స్పందించిన కలెక్టర్ మంగళవారం నగరపాలక సంస్థ కమిషనర్‌ను తక్షణమే మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. దీంతో బుధవారం ఐరన్ కడ్డీలు సిద్ధం చేసి, నిర్మాణ మరమ్మతులు చేపట్టేందుకు అధికారులు సిద్ధమయ్యారు.

బ్యాట్ పట్టిన ఎమ్మెల్యే!



ఇదేదో రంజీ ట్రోఫి టోర్నమెంట్ కాదు. ఇంటర్నేషనల్ టెస్ట్ మ్యాచ్ అంతకన్నా కాదు. యంగ్ క్రికెటర్ రవీంద్ర జడేజా స్టైల్‌లో క్రికెట్ ఆడుతున్న ఆయన పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు. బుధవారం పత్తికొండలో పోలీస్ అమరవీరుల దినోత్సవం సందర్భంగా జర్నలిస్టులు, పోలీసుల జట్లు ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్ జరిగింది. ఈ సందర్భంగా పోలీసుల టీం తరపున ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు పాల్గొని బౌలింగ్, బ్యాటింగ్ చేశారు. కాసేపు రాజకీయాలను పక్కన పెట్టి ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు గ్రౌండ్‌లో క్రికెట్ ఆడారు.

-పత్తికొండ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి)


బ్యాటింగ్ చేస్తున్న ఎమ్మెల్యే

బంతి పూల ధర పతనం





రైతు సాదిక్ హుసేన్ / విరగ్గాసిన బంతిపూలు

చాగలమర్రి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): వరుసగా కురుస్తున్న వర్షాలతో పూల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పండుగ సీజన్‌ను దృష్టిలో పెట్టుకొని చాగలమర్రి మండలంలో బంతిపూలను సాగు చేశారు. దసరా తరువాత ధరలు తగ్గి రైతులకు నష్టాలు మిగిల్చాయి. గొడిగనూరు, ఎం.తండా తదితర గ్రామాల్లో బంతిపూలను విస్తారంగా సాగు చేశారు. కొన్ని రోజులుగా కురుస్తున్న తుఫాన్‌తో పూసిన పూలన్నీ కుళ్లి పోతున్నాయి. వారం రోజుల కిందట కిలో రూ.100 పలికిన ధర పతనమైంది. కిలో రూ.10 కూడా కొనేవారు లేక నేల చూపులు చూస్తోంది. చాగలమర్రి గ్రామంలో సాదిక్‌హుసేన్ అనే రైతు సాగు చేసిన బంతిపూల తోట దెబ్బతింది. అర ఎకరాకు రూ.20 వేలు ఖర్చు చేసిన పైసా కూడా రాలేదు. కిలో రూ.10లకు విక్రయిస్తామన్నా కొనేందుకు వ్యాపారులు ముందుకు రావడం లేదు. పెట్టిన పెట్టుబడి రాక తీవ్రంగా నష్టపోవాల్సి వచ్చిందని రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నిండుకుండలా జలాశయం

శ్రీశైలం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): నీలం సంజీవరెడ్డి శ్రీశైలం జలాశయానికి ఎగువ పరివాహక ప్రాంతాల నుంచి వరద ప్రవాహం భారీగా కొన సాగుతోంది. దీంతో డ్యాం నిండు కుండలా కళకళలాడుతోంది. బుధవారం జూరాల నుంచి 37,343 క్యూసెక్కులు, సుంకేసుల నుంచి 1,05,175 క్యూసెక్కులు మొత్తం 1,42,518 వరద వస్తోంది. బుధవారం సాయంత్రం 6 గంటల సమయానికి జలాశయానికి 1,05,547 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరింది. శ్రీశైలం జలాశయం పూర్తి స్థాయి నీటి మట్టం 885 అడుగులు కాగా ప్రస్తుత పూర్తి స్థాయి నీటిమట్టం 884.50 అడుగులకు చేరుకుంది. జలాశయం పూర్తి స్థాయి నీటి నిల్వ 215.807 టీఎంసీలు కాగా ప్రస్తుత నీటి నిల్వ 212.9198 టీఎంసీలుగా నమోదైంది. ఆంధ్రప్రదేశ్ జల విద్యుత్ కేంద్రం ద్వారా 30,253 క్యూసెక్కులు, తెలంగాణ విద్యుత్ కేంద్రం ద్వారా 35,315 క్యూసెక్కుల నీటితో విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నారు.



బీఈడీ సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం

కర్నూలు అర్బన్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): బీఈడీ మొదటి సెమిస్టర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. బుధవారం ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాలోని 17 పరీక్షా కేంద్రాల్లో రెగ్యులర్ 3,688, సప్లిమెంటరీ 1,513 మంది విద్యార్థులు పరీక్షలకు దరఖాస్తు చేసుకోగా 3943 మంది హాజరై పరీక్షలు రాశాలని పరీక్షల విభాగం కంట్రోలర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్లు తెలిపారు.

ఆత్మ పీడీగా రత్నప్రసాద్ నియామకం

కర్నూలు అగ్రికల్చర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆత్మ ప్రాజెక్టుకు జేడీ స్థాయి అధికారిని డైరెక్టర్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ మేరకు కర్నూలు జిల్లా ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్‌గా రత్నప్రసాద్ నియమితులయ్యారు. చిత్తూరు జిల్లాలో వ్యవసాయ శాఖలో డిప్యూటీ డైరెక్టర్‌గా ఉన్న రత్నప్రసాద్ జాయింట్ డైరెక్టర్‌గా పదోన్నతి కల్పించి కర్నూలు ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్‌గా నియమించారు. ఈ పోస్టు కర్నూలులో రెండేళ్లుగా ఖాళీగా ఉంది. త్వరలోనే పూర్తి స్థాయిలో ఆత్మ ప్రాజెక్టును పునర్నిర్మించి రైతులకు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తీసుకు వస్తామని ఆయన తెలిపారు.

పీఎం ఇంటర్న్‌షిప్‌నకు దరఖాస్తులు

కర్నూలు కలెక్టరేట్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కేంద్రం ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్ పథకం కింద అభ్యర్థులను ఎంపిక చేస్తోంది. Www.pministernship.mca.gov.in ఆన్‌లైన్ పోర్టల్‌లో అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు చేసుకోవడానికి ఈ నెల 25 వరకు అవకాశం ఉంది. దేశంలోని 400 అగ్రగామి కంపెనీలలో 12 నెలల పాటు ఇంటర్న్‌షిప్ చేసుకునేందుకు వీలుగా ఏర్పాట్లు చేసింది. పది, ఇంటర్మీడియట్, డిగ్రీ, డిప్లొమా పూర్తి చేసిన వారు పీఎం ఇంటర్న్‌షిప్‌నకు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు. వయస్సు 21 నుంచి 24 మధ్య ఉండాలి. ఆధార్ అనుసంధానమైన ఫోన్ నెంబర్, బయోడేటాతో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. అభ్యర్థి ప్రొఫైల్‌తో ఈకేవైసీ పూర్తి చేయాలి. చిరునామా, కేటగిరి, ఈ మెయిల్ ఐడీ బ్యాంక్ ఖాతా వివరాలు నమోదు చేయాలి.

రేపు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

నందికొట్కూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయం, గోసంరక్షణ, వాననీటి సంరక్షణలపై అవగాహన సదస్సును 25న జూపాడుబంగ్లా మండలం పారుమంచాల శివక్షేత్రంలో నిర్వహిస్తున్నట్లు ప్రచారకుడు విజయ్ రావు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి వందమందిలోపు రైతులు మాత్రమే పాల్గొంటారని, ఆసక్తి గల రైతులు ముందుగా పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాల్గొనే వారు నోట్ ప్యాడ్, పెన్, బట్ట సంచి, స్టీల్ ప్లేట్, వాటర్ బాటిల్‌తో హాజరు కావాలని సూచించారు. ఈ సదస్సులో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండించిన వ్యవసాయ ఉత్పత్తులతో చేసిన భోజన సదుపాయం ఉంటుందన్నారు.

లా 5,7,9 సెమిస్టర్ ఫలితాలు విడుదల

కర్నూలు అర్బన్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో బ్యాచిలర్ ఆఫ్ లెజిస్లేటివ్ లాస్ (లా) 5,7,9 సెమిస్టర్ ఫలితాలు విడుదల చేశారు. బుధవారం పరీక్షల విభాగం కంట్రోలర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రెగ్యులర్, సెమిస్టర్ ఫలితాలను విడుదల చేశామని, మరిన్ని వివరాలకు వర్సిటీ వెబ్‌సైట్‌లో చూసుకోవాలని పేర్కొన్నారు.

ఎస్సార్బీసీ కాల్వలో పడి మహిళ మృతి

బనగానపల్లె, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): బనగానపల్లె పట్టణం తమ్మడపల్లె రహదారిలోని ఎస్సార్బీసీ కాల్వలో పడి గుర్తు తెలియని మహిళ మృతి చెందినట్లు బనగానపల్లె ఎస్ఐ దుగ్గిరెడ్డి బుధవారం తెలిపారు. తమ్మడపల్లె రహదారిలోని ఎస్సార్బీసీ సబ్ కాల్వలో మృతదేహాన్ని కనుగొన్నట్లు ఆయన పేర్కొన్నారు. మృతి చెందిన మహిళకు సుమారు 35 ఏళ్లు ఉంటాయని, ఎర్రటి పావడ, నలుపు రంగు జాకెట్ ధరించి దని తెలిపారు. మహిళ ఆనవాళ్లు గుర్తించినట్లయితే 9221101124, 9121101042 నంబర్లకు ఫోన్ చేయాలని కోరారు.

తిరుమల ఘాట్ రోడ్డులో కర్నూలు వాసులకు గాయాలు

తిరుమల, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): తిరుమల మొదటి ఘాట్ రోడ్డులో బుధవారం ఓ టాటా సుమో వాహనం బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కర్నూలు నగరానికి చెందిన 8 మంది భక్తులు స్వల్పంగా గాయపడ్డారు. కర్నూలుకు చెందిన శివ, సంజయ్ కుటుంబ సభ్యులతో మంగళవారం తిరుమలకు వచ్చారు. స్వామి దర్శనం పూర్తి చేసుకుని బుధవారం ఉదయం తిరుమల నుంచి ప్రైవేట్ వాహనంలో తిరుగు ప్రయాణమయ్యారు. మార్గంలోని 24వ మలుపు వద్ద వాహనం ఒక్కసారిగా బోల్తా పడింది. దీంతో శివ, సంజయ్‌తో సహా కుటుంబ సభ్యులు, డ్రైవర్ హేమంత్ స్వల్పంగా గాయపడ్డారు. బ్రేక్ ఫెయిల్ కావడంతోనే ప్రమాదం జరిగినట్లు డ్రైవర్ తెలిపారు.

వలస కూలీ మృతి

ఆస్పరి, అక్టోబరు 23, (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఐనేకల్లు గ్రామానికి చెందిన మౌనిక (23) తన భర్త గోవిందుతో బతుకుదెరువు కోసం తిరుపతికి వెళ్లి ప్రమాదవశాత్తు మంగళవారం మృతి చెందింది. రెండు నెలల క్రితం తిరుపతిలో భవన నిర్మాణ పనులు చేసేందుకు గ్రామం వదలి వెళ్లారు. పనులు చేస్తుండగా, కంకర మిషన్‌లో పడి మౌనిక మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. స్థానికంగా వ్యవసాయ పనులు లేకపోవడంతో వలస వెళ్లారు. మృతురాలికి ఇద్దరు కుమారులు ఉన్నారు. మౌనిక మృతితో గ్రామంలో విషాదం అలముకుంది.

లారీ బోల్తా.. ఇద్దరికి గాయాలు

దేవనకొండ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : పత్తికొండ నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న కూరగాయల లారీ మంగళవారం రాత్రి కరిడికొండ బస్ స్టేజీ సమీపంలో అదుపు తప్పి బోల్తా పడింది. ఎదురుగా బస్సు వేగంగా లారీ వైపు దుసుకురావడంతో ప్రమాదాన్ని తప్పించబోయి లారీ అదుపు తప్పింది. ప్రమాదంలో క్లీనర్ కార్తీక్, తుగ్గలి మండలం పెరవలి గ్రామానికి చెందిన రైతు ఇస్మాయిల్‌కు తీవ్ర గాయాలు కావడంతో, వైద్యం కోసం కర్నూలుకు తరలించారు.



బోల్తా పడిన కూరగాయల లారీ

మలిపెళ్లికి వెళుతూ పరలోకానికి..

- ఇన్నోవాను ఢీకొన్న ఆర్టీసీ ఎలక్ట్రికల్ బస్సు
- రైల్వేకోడూరు సమీపంలో ప్రమాదం
- ముగ్గురు కర్నూలు వాసుల మృతి



మృతి చెందిన సుచిత్ర



మృతి చెందిన వాసవి



మృతి చెందిన ప్రేమ్‌కుమార్



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు

రైల్వే కోడూరు / కర్నూలు క్రైమ్, అక్టోబరు 23 (ఆంధ్ర జ్యోతి) : రైల్వేకోడూరు మండ లంలోని ప్రధాన దారిలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కర్నూలుకు చెందిన ముగ్గు రు మృతి చెందగా పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. మలిపెళ్లికి వెళుతుండగా ఈ ఘటన జరగ డంతో పెళ్లింట విషాదం నెలకొంది.



ప్రమాదంలో దెబ్బతిన్న ఆర్టీసీ బస్సు

వివరాలు ఇలా.. షరాఫ్ బజారుకు చెందిన గురువయ్యకు ముగ్గురు కొడుకులు సంతానం. పెద్ద కొడుకు రాజేష్ కూతురు సిరిచందన పెళ్లి ఈ నెల 20న దిన్నెదేవరపాడు సమీపంలో ఉన్న ఓ ఫం క్షన్ హాలులో జరిగింది. పెళ్లి రిసప్షన్ తిరుపతి లో ఉండడంతో గురువయ్య కుటుంబ సభ్యులు, వారి బంధువులు కార్లలో బయలుదేరారు. సా యంత్రం 5గంటల సమయంలో రైల్వేకోడూరు మండలం మైసూరివారిపల్లె పంచాయతీ పరిధిలోని రాజానగర్ ప్రధాన రహదారిలో తిరుపతి నుంచి కడపకు వెళుతున్న ఆర్టీసీ ఎలక్ట్రికల్ బస్సు పెళ్లి వారి ఇన్నోవా వాహనాన్ని ఢీకొంది. దీంతో ఇన్నోవాలో ఉన్న రాజేశ్వరి, లలితమ్మ, ఉపేంద్ర, మహేశ్, ప్రేమ్‌కుమార్, సుచిత్ర, వాసవిలు తీవ్రంగా గాయపడ్డారు. వీరికి రైల్వేకోడూరు ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రథమ చికిత్స చేయించి అనంతరం తిరుపతిలోని అమర ఆసుపత్రికి తరలించారు. తిరుపతి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ప్రేమ్‌కుమార్ (45), వాసవి (51), సుచిత్ర (45) మృతి చెందారు. విష యం తెలుసుకున్న తిరుపతిలోని బంధువులు ఆస్పత్రికి చేరుకున్నారు. బంధువుల రోదనలు మిన్నంటాయి. ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న కడపకు చెందిన ప్రభాకర్, మహ్మద్ గాయపడ్డారు. రోడ్డు ప్రమాదం సమాచారం తెలుసుకు న్న రైల్వేకోడూరు సీఐ హేమసుందర్‌రావు సిబ్బందితో ప్రమాద స్థలానికి చేరుకుని సహా యక చర్యలు చేపట్టారు. ప్రమాదంలో కారు ముందుభాగం నుజ్జునుజ్జయింది. ఆర్టీసీ ఎలక్ట్రిక ల్ బస్సు ముందు భాగం దెబ్బతింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని రైల్వేకో డూరు సీఐ హేమసుందర్‌రావు తెలిపారు.

ఆటో ట్రాక్టర్ ఢీకొని ఒకరి మృతి

- నలుగురికి గాయాలు



పర్ల సత్యం (ఫైల్)

కోడుమూరు రూరల్, (ఆంధ్రజ్యోతి) అక్టోబరు 23: మండలంలోని అమడగుంట్ల-చిల్లబండ గ్రామాల మధ్యన మంగళవారం రాత్రి జరిగిన ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. గోరంట్ల గ్రామానికి చెందిన బోయ పర్ల సత్యం మరికొందరు బేల్దారి పనులు చేస్తూ కుటుంబాలను పోషించుకుంటున్నారు. మంగళవారం కర్నూలులో పనులకు వెళ్లి రాత్రి ఆలస్యంగా ఆటోలో బయలుదేరారు. అయితే అమడగంట్ల గ్రామం దాటిన తర్వాత ఎదురుగా ఉల్లిగడ్డల లోడుతో వస్తున్న ట్రాక్టర్.. వీరు ప్రయాణిస్తున్న ఆటోను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న బోయ పర్ల సత్యం (38) అక్కడికక్కడే మృతి చెందాడు. గిడ్డయ్య, నాగరాజు అనే వ్యక్తులకు తీవ్రగాయాలయ్యాయి. మరో ఇద్దరు స్వల్పంగా గాయపడ్డారు. ఆటోలో, ట్రాక్టర్‌లో ఉన్న వ్యక్తులది గోరంట్ల గ్రామమే. గ్రామస్థులు పెద్ద ఎత్తున ఘటనా స్థలికి చేరుకొని క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. వీరిలో గిడ్డయ్య పరిస్థి తి విషమంగా ఉన్నట్లు సమాచారం. పోలీసులు సత్యం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కోడుమూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బుధవారం మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. మృతుడికి భార్య చంద్రకళ, కూతురు, కొడుకు ఉన్నారు. ఎమ్మెల్యే దస్తగిరి బుధవారం మధ్యాహ్నం కోడు మూరు ప్రభుత్వాసుపత్రికి చేరుకుని బాధితుల ను పరామర్శించారు. ఆయనతోపాటు టీడీపీ నాయకులు సర్పంచ్ బాలక్రిష్ణ, కున్నూరు మధు, యల్లప్ప, రవీంద్ర పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో బాధితుడికి న్యాయం

కర్నూలు లీగల్, అక్టోబరు 23 (ఆంధ్ర జ్యోతి): శాశ్వత లోక్ అదాలత్ జోక్యంతో ఓ బాధితుడికి న్యాయం దక్కింది. నంద్యాల జిల్లా బేతంచెర్ల మండలానికి చెందిన కె.మహేశ్వర రెడ్డి తన ఇంటి పత్రాలను తాకట్టు పెట్టి రంగాపురంలోని స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా బ్రాంచ్ నుంచి హౌస్ లోను తీసుకున్నాడు. ఆ తర్వాత లోన్ మొత్తాన్ని 2022, అక్టోబరు 15న చెల్లించేశాడు. అయితే బ్యాంకు అధికారులు ఫిర్యాది ఇంటి పత్రాలను వాపసు చేయకుండా నిర్లక్ష్యం చేయడమే కాకుండా ఇంటి తనఖాను రద్దు చేయలేదు. దీంతో ఫిర్యాది తన న్యాయవాది పి.శివసుదర్శన్ ద్వారా శాశ్వత లోక్ అదాలత్‌ను ఆశ్రయించాడు. రిజర్వు బ్యాంకు నియమావళి ప్రకారం ఫిర్యాదికి రోజుకు రూ.5 వేలు చొప్పున నష్టపరిహారం చెల్లించాల్సి ఉంటుంది. దీంతో కేసును విచారించిన శాశ్వత లోక్ అదాలత్ బ్యాంకు అధికారులను కోర్టుకు పిలిపించి ఇరు వర్గాలకు ఆమోదయోగ్యకరమైన పరిష్కారాన్ని చూపించారు. ఈ మేరకు బ్యాంకు అధికారులు ఫిర్యాదికి నష్టపరిహారంగా రూ.85 వేలు చెల్లించి ఇంటికి సంబంధించిన సర్టిఫైడ్ కాపీ పత్రాలను వాపసు చేయడానికి అంగీకరించారు. శాశ్వత లోక్ అదాలత్‌లో సభ్యులు టి.శివశంకర్‌రెడ్డి, డి.రాజబాబులు ఇరువర్గాలను రాజీ మార్గం ద్వారా కేసును పరిష్కరించేందుకు కృషి చేసినట్లు శాశ్వత లోక్ అదాలత్ అధ్యక్షులు ఎం.వెంకటహరినాథ్ తెలిపారు.

● మరొక కేసులో ఏటీఎంలో చినిగిపోయిన రూ.500 నోటుకు బదులుగా కొత్త నోటును ఇవ్వడానికి తిరస్కరించిన స్థానిక గాయత్రీ ఎస్టేట్‌లోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మధ్య వచ్చిన వివాదాన్ని శాశ్వత లోక్ అదాలత్ పరిష్కరించింది. ఫిర్యాది ఎం.హేమం తేశ్వర మునిరాజు ఈ ఏడాది అక్టోబరు 2న గాయత్రీ ఎస్టేట్‌లోని ఎస్‌బీఐ ఏటీఎం నుంచి తన వైద్య ఖర్చుల నిమిత్తం రూ.5 వేలు డ్రా చేశాడు. అందులో చినిగిపోయిన రూ.500 నోటు వచ్చింది. దీంతో ఫిర్యాది బ్యాంకు అధికారులకు ఆశ్రయించి తన నోటు ను బదిలీ చేయాలని కోరారు. దీనికి బ్యాంకు అధికారులు తిరస్కరించారు. దీంతో బాధితుడు లోక్ అదాలత్‌ను ఆశ్రయించాడు. బ్యాంకు అధికారులను శాశ్వత లోక్ అదాలత్ పిలిపించి ఫిర్యాదికి కొత్త రూ.500 నోటును ఇవ్వడంతో సమస్య పరిష్కారమైంది.

మహానందిలో వీహెచ్‌పీ జాతీయ అధ్యక్షుడి పూజలు



మిలిన్ పరండేకు స్వామివారి మెమెంటో అందజేస్తున్న ఈవో

మహానంది, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రంలో విశ్వహిందూ పరిషత్ జాతీయ అధ్యక్షుడు మిలిన్ పరండే ప్రత్యేక పూజలు నిర్వహించా రు. బుధవారం ఆలయ ముఖ ద్వారం వద్ద వీరికి ఆలయ ఈవో నల్ల కాల్వ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యం లో అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం ప్రధాన ఆలయాల్లో స్వామి, అమ్మవార్లకు అభిషేకార్చనలు జరిపారు. పూజల అనంత రం కల్యాణ మండపంలో వీరిని ఆలయ వేదపండితులు ఆశీర్వదించారు. ఆలయ ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి శాలువతో సన్మానించి, స్వామివారి మెమెంటోను అందజేశారు. వీరి వెంట వీహెచ్‌పీ దక్షిణ భారత కార్యదర్శి శ్యాం సత్యంజీ, క్షేత్ర అధ్యక్షులు సాయిరెడ్డి, వీహెచ్‌పీ జిల్లా ప్రముఖులు విష్ణువర్ధన్‌రెడ్డి, చంద్రమౌళీశ్వర రెడ్డి, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు. మహానంది ఆలయ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం సహకారం అందించాని జాతీయ అధ్యక్షుడు మిలిన్‌పరండేను ఆలయ ఈవో కోరారు.

పోలీసుల వేధింపులతో వ్యక్తి ఆత్మహత్యాయత్నం

సి. బెళగల్, అక్టోబరు 23 ఆంధ్రజ్యోతి: పోలీసుల వేధింపులు తాళలేక తిమ్మనదొడ్డి గ్రామానికి చెందిన నర్సన్న బుధవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. ఈ నెల 5న గ్రామానికి చెందిన లక్ష్మన్న, తిమ్మయ్య హమాలీ డబ్బు పంపకంలో ఘర్షణ పడ్డారు. నర్సన్న కుమారుడైన లక్ష్మన్న ఆగ్రహంతో తిమ్మయ్య ఇంటికి వెళ్లి నానాదుర్భాషలాడాడు. దీంతో రాముడు అనే వ్యక్తి కుమారులైన తిమ్మయ్య, నాగేష్ తదితర కుటుంబ సభ్యులు తమపై నర్సన్న, లక్ష్మన్న దాడి చేశారని పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. స్టేషన్‌లో పోలీసులు వేధించడంతో నర్సన్న పురుగుమందు తాగాడని తెలుసుకున్న కుటుంబ సభ్యులు ఆయనను కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పురుగుల మందు ఎందుకు తాగవని వైద్యులు నర్సన్నను అడిగితే పోలీసులు వేధించడంతో తాళలేక పురుగుమందు తాగినట్లు వైద్యులకు తెలిపినట్లు సమాచారం. దీనిపై ఎస్ఐ తిమ్మారెడ్డిని వివరణ కోరగా ఈ విషయం తన దృష్టికి రాలేదని, రెండు రోజులుగా స్టేషన్‌లో లేనని వివరణ ఇచ్చాడు. రాముడు కుమారులైన నాగేష్, తిమ్మయ్యలపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తిమ్మారెడ్డి తెలిపారు.

రైతులకు అండగా ఉంటాం: ఎంపీ

కర్నూలు అగ్రికల్చర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రైతులకు అండగా ఉంటామని ఎంపీ బస్తిపాటి నాగరాజు అన్నారు. బుధవారం కర్నూలు మార్కెట్ యార్డులో సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ జయలక్ష్మితో కలిసి పర్యటించారు. ఉల్లిగడ్డలు విక్రయానికి తెచ్చిన రైతులతో మాట్లాడారు. గిట్టుబాటు ధర అందుతుందో లేదోనని, ఏమైనా సమస్యలు ఉన్నాయా అని రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతులకు గిట్టుబాటు ధర అందించాలని సెక్రటరీ జయలక్ష్మిని ఆదేశించారు. యార్డులో రైతులకు అవసరమైన వసతుల కల్పనకు తీసుకోవాల్సిన చర్యల గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో అదనపు సెక్రటరీలు రెహిమాన్, వెంకటేశ్, సూపర్ వైజర్లు కేశవరెడ్డి, నాగేష్, శివన్న పాల్గొన్నారు.



కర్నూలు మార్కెట్ యార్డులో రైతులతో మాట్లాడుతున్న ఎంపీ బస్తిపాటి నాగరాజు

పర్సన్ ఇన్‌చార్జిల పదవీ కాలం పొడిగింపు

కర్నూలు అగ్రికల్చర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల పర్సన్ ఇన్‌చార్జిల పదవీ కాలం పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వారి పదవీ కాలం ఈ నెలతో ముగుస్తుండటంతో మరో ఆరు నెలలపాటు వారి పొడిగిస్తూ రెండు రోజుల క్రితం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు అధికార వర్గాలు తెలిపాయి. 2018లో ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు, జిల్లా సహకార కేంద్ర బ్యాంకు పాలక వర్గాలకు అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం ఎన్నికలు నిర్వహిం చింది. ఆ తర్వాత వివిధ కారణాలతో ఎన్నికలను వాయిదా వేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

నేటితో ముగియనున్న ఇసుక టెండర్లు

కర్నూలు అర్బన్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ఇసుక టెండర్ల గడువు గురువారంతో ముగియనుంది. 28న జాయింట్ కలెక్టర్ సమక్షంలో టెండర్లు దక్కించుకున్న వారికే ఇసుక తవ్వకాలు, రవాణ బాధ్యతలను కట్టబెట్టనున్నారు. జిల్లాలో మరళీ ఇసుక రీచ్‌కు టెండర్లు పిలిచారు. 72,135 టన్నుల ఇసుక తవ్వకాలు, స్టాక్ పాయింట్‌కు రవాణా కలిపి టన్నుకు రూ.110 నిర్ణయించారు. ఈ టెండర్లలో దాదాపు 14 మంది సీల్డ్ బాక్స్‌లో టెండర్లు వేసినట్లు సమాచారం. వారిలో కొద్ది మంది ప్రభుత్వం నిర్ణయించిన ధరకు కోట్ చేయకుండా అడ్డుకున్నట్లు తెలిసింది. 2019లో టన్నుకు రూ.145 దాకా వేసి దక్కించుకుని పనులు చేశామని, ప్రస్తుత నిర్ణయించిన ధర గిట్టుబాటు కాదంటూ సిండికేట్‌గా ఏర్పడి దక్కిం చుకోవాలనే వ్యూహం పన్నినట్టు తెలుస్తోంది. ఈ మేరకు టెండర్స్ అధిక ధరకే కోట్ చేసినట్లు సమాచారం. కాగా పారదర్శకంగా టెండర్లు జరుగుతాయని గనుల శాఖ డిప్యూటీ డైరెక్టర్ రవిచంద్ర పేర్కొన్నారు.

'పోరుబాటకు సిద్ధం కండి'

కర్నూలు ఎడ్యుకేషన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): విద్యారంగ సమస్యలపై పోరుబాటకు సిద్ధం కావాలని విద్యార్థులకు ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే.శివారెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక సీఆర్ భవన్‌లో ఏఐఎస్ఎఫ్ నగర శాఖ ఆధ్వర్యంలో కోశాధికారి అశోక్ అధ్యక్షతన నగర మహాసభలు నిర్వహించారు. అనంతరం నగర నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నగర నిర్మాణ బాధ్యులు రామకృష్ణారెడ్డి, మాజీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సోమన్న, సాబీర్ బాషా, జిల్లా ఉపాధ్యక్షుడు శరత్ కుమార్, జిల్లా కార్యదర్శి నాగరాజు పాల్గొన్నారు.

రాష్ట్ర క్యాబినెట్ నిర్ణయంపై హర్షం

కర్నూలు న్యూసిటీ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): దేవాలయ పాలక మండలిలో ఇద్దరు బ్రాహ్మణులకు స్థానం కల్పిస్తూ రాష్ట్ర క్యాబినెట్ తీసుకున్న నిర్ణయం హర్షణీయమని ఏపీ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.వెంకటరామరాజు అన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని నెరవేర్చినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌లకు రాష్ట్ర సంఘం తరుపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సంఘం రాష్ట్ర కార్యదర్శి కృష్ణమూర్తి, సంయుక్త కార్యదర్శి నాగరాజుశర్మ, జిల్లా అధ్యక్షుడు వసంత కుమార్ పాల్గొన్నారు.

ట్రైనీ ఏఈ రామ్మోహన్‌కు ఒక రోజు జీతం కట్

కర్నూలు న్యూసిటి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థ పరిధిలో పని చేస్తున్న (అమ్యూనిటీ సెక్రటరీ) ట్రైనీ ఏఈ రామ్మోహన్‌కు ఒక్క రోజు జీతం నిలుపుదల చేస్తూ ఎస్ఈ జి.రాజశేఖర్ ఉత్తర్వులు జారీ చేశారు. నిబంధనలు ఉల్లంఘించి తాగునీరు సరఫరా చేసినందుకు చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు.

డీఈవో కార్యాలయంలో పని చేయని లిఫ్టు

కర్నూలు ఎడ్యుకేషన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): డీఈవో కార్యాలయంలో రెండు నెలల నుంచి లిఫ్టు పని చేయడం లేదు. దాంతో దివ్యాంగులు వివిధ పనుల నిమిత్తం మెట్ల మార్గంలో వెళ్లలేక ఇబ్బందులు పడుతున్నారు. లిఫ్టుల మరమ్మతుల నిర్వహణను పర్యవేక్షించాల్సిన అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. నాలుగు సంవత్సరాల కిందట కేంద్ర ప్రభుత్వ నిధులతో డీఈవో కార్యాలయంలో గ్రౌండ్ ఫ్లోర్ నుంచి ఎస్ఎస్ఏ కార్యాలయం వరకు వెళ్లేందుకు లిఫ్టును ఏర్పాటు చేశారు. ఈ లిఫ్టు ఏర్పాటు బాధ్యతలను జిల్లా ఆర్అండ్‌బీ శాఖకు అప్పగించినట్లు తెలుస్తోంది. సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని నిరుపయోగంగా ఉన్న లిఫ్టును వినియోగంలోకి తీసుకురావాలని వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలు, దివ్యాంగులు విజ్ఞప్తి చేస్తున్నారు.


పని చేయని లిఫ్టు

పప్పుశనగ సబ్సిడీపై మొగ్గు చూపని రైతన్న

- ప్రభుత్వ, బహిరంగ మార్కెట్ ధరకు వ్యత్యాసం లేదంటున్న అన్నదాతలు
- సబ్సిడీని 50 శాతానికి పెంచాలని డిమాండ్

ఓర్వకల్లు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): సబ్సిడీ పప్పుశనగ విత్తనాల పంపిణీపై రైతన్నలు మొగ్గు చూపడం లేదు. బహిరంగ మార్కెట్‌లో ధరకు, ప్రభుత్వం ఇస్తున్న ధరకు పెద్ద తేడా ఏమీ లేదని రైతులు ఆరోపిస్తున్నారు. మండలంలో ఈ ఏడాది దాదాపు పది వేల ఎకరాల్లో రైతులు పప్పుశనగ సాగుకు తమ పొలాలను సిద్ధం చేసుకున్నారు. మండలంలోని ఓర్వకల్లు, హుశేనాపురం, ఉయ్యాలవాడ, ఉప్పలపాడు, లొద్దిపల్లె, పూడిచెర్ల, కన్నమడకల తదితర గ్రామాల్లో పప్పుశనగ సాగు చేస్తారు. మండలానికి 2,500 క్వింటాళ్ల సబ్సిడీ శనగ విత్తనాలు మంజూరయ్యాయి. సబ్సిడీ 25 శాతమే ఇస్తుండటంతో తమకు పెద్దగా ఉపయోగం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. క్వింటం పప్పుశనగకు ప్రభుత్వం వాస్తవ ధర రూ.9,400 ఉండగా.. అందులో 25 శాతం సబ్సిడీ రూ.2,350 పోనూ రూ.7,050లుగా ధర నిర్ణయించింది. బహిరంగ మార్కెట్‌లో పప్పుశనగ క్వింటం రూ.7,100 నుంచి రూ.7,500 వరకు ఉంది. దీంతో ప్రభుత్వం ధరకు, బహిరంగ మార్కెట్ ధరకు ఏమి వ్యత్యాసం ఉందంటూ రైతులు ప్రశ్నిస్తున్నారు.


(పప్పుశనగకు సిద్ధంగా ఉన్న పొలం

● తగ్గించడంతో ఇబ్బంది

గత ఏడాది పప్పుశనగ సక్రమంగా పండక రైతులు ఇబ్బందుల్లో ఉన్నారు. ప్రభుత్వం 50 శాతం సబ్సిడీతో విత్తనాలు అందిస్తే ఉపయోగకరమని రైతులు అంటున్నారు. గత ప్రభుత్వం రైతులకు 40 శాతం సబ్సిడీతో పప్పుశనగ అందించిందని, ప్రస్తుత కూటమి ప్రభుత్వం దానిని 25 శాతానికి తగ్గించడం సరికాదని రైతులు ఆవేదన చెందుతున్నారు.

ధరలు తగ్గించాలి



రైతులకు సబ్సిడీతో అందిస్తున్న విత్తనాల ధరలను తగ్గించాలి. ఇప్ప టికే చాలా మంది రైతులు ప్రభుత్వ ధరను చూసి బహిరంగ మార్కెట్ లోనే విత్తనాల కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నారు. ప్రభుత్వం ఇచ్చే విత్తనాలకు ముందుగానే డబ్బులు చెల్లించాల్సి ఉంది. కానీ బహిరంగ మార్కెట్‌లో వ్యాపారులు అప్పుగా ఇస్తున్నారు. దీంతో రైతులు బహిరంగ మార్కెట్ వైపు ఆసక్తి చూపుతున్నారు.

– ఘుడేకారి శేఖర్, రైతు, హుశేనాపురం

50 శాతం సబ్సిడీతో ఇవ్వాలి



రైతులకు 50 శాతం సబ్సిడీతో పప్పు శనగ విత్తనాలను అందిస్తే.. ఎంతో లబ్ధి చేకూరుతుంది. పేద, మధ్యతరగతి రైతులకు విత్తనాల కొనుగోలు భారంగా మారుతోంది. సబ్సిడీని పెంచితే రైతులకు ఎంతో ఉపయోగకరం.

– అబ్దుల్లా, రైతు, ఓర్వకల్లు

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

అర్హులందరికీ గృహాలు

– హౌసింగ్ ఏఈ ఎం జమ్మన్న



గూడూరు అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): అర్హులైన పేదలందరికీ గృహాలు మంజూరు అవుతాయని హౌసింగ్ ఏఈ ఎం. జమ్మన్న అన్నారు. బుధవారం పట్టణంలోని హౌసింగ్ కార్యాలయంలో ఏఈ 'ఆంధ్రజ్యోతి'కి ఇంటర్వ్యూ ఇచ్చారు.

ప్రశ్న: మండలంలో గృహ నిర్మాణాల పరిస్థితి ఎలా ఉంది?

జవాబు: మండలంలో గృహ నిర్మాణాలు వేగవంతం చేశాం. అర్బన్‌కు సంబంధించి 920 గృహాలు మంజూరు కాగా, అందులో 801 గృహాలు పూర్తయ్యాయి. మిగిలిన 119 గృహాలు వివిధ దశల్లో ఉన్నాయి. అలాగే రూరల్‌కు సంబంధించి 252 గృహాలు మంజూరు కాగా అందులో 187 గృహాలు పూర్తి కాగా, మిగిలిన 65 వివిధ దశల్లో ఉన్నాయి.

ప్ర: ఎప్పటిలోగా నిర్మాణాలు పూర్తి చేసుకోవాలి?

జ: గృహ నిర్మాణ లబ్ధిదారులందరికీ నిర్మాణాల పూర్తి చేసుకోవాలని గ్రామ సభలను నిర్వహించి అవగాహన కల్పిస్తున్నాం. 2025 మార్చి నాటికి పూర్తి చేసుకోవాలని లబ్ధిదారులకు చెబుతున్నాం.

ప్ర: బిల్లుల చెల్లింపు ఎలా ఉంది?

జ: గృహ నిర్మాణాలకు సంబంధించి బీఎల్ - రూ.70వేలు, రూఫ్ - రూ. 27,500/-, కప్పు - 31,000/-, ఫైనల్ బిల్లు - రూ. 21,500/-, చెల్లింపు జరుగుతుంది. అలాగే ఎన్ఆర్ఈజీఎస్ కింద రూ. 30,000/- చెల్లిస్తామని, మొత్తం రూ. 1,80,000/- చెల్లిస్తున్నాం.

స్కూల్ గేమ్స్ ఎంపిక పోటీలు

కర్నూలు స్పోర్ట్స్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-14, 17 బాలబాలికలకు ఈ నెల 25న యోగా, చెస్, 28న హాకీ, వెయిట్ లిఫ్టింగ్, క్రికెట్ క్రీడా ఎంపిక పోటీలు కర్నూలు డీఎస్ఏ స్టేడియంలో నిర్వహించనున్నట్లు జిల్లా కార్యదర్శి గిడ్డయ్య తెలిపారు. ఎంపిక ఉమ్మడి జిల్లా క్రీడాకారులు హాజరు కావాలని వారు తెలిపారు. ఉమ్మడి జిల్లాల హ్యాండ్‌బాల్ జిల్లా జట్టు ఈ నెల 25న ఉదయం 10 గంటలకు నంద్యాల రైల్వేస్టేషన్‌లో రిపోర్టు చేయాలని కార్యదర్శి గిడ్డయ్య తెలిపారు.

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి సహకరించండి

కర్నూలు అర్బన్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి సహకరించాలని ఎంపీ బస్తిపాటి నాగరాజు కోరారు. అనంతపురంలోని ఆర్డీటీ కార్యాలయంలో రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్(ఆర్డీటీ)చైర్మన్ మోంచో ఫెర్రర్‌ను ఎంపీ కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ ద్వారా ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేసి తాగునీరు అందించడంతో పాటు పాఠశాలలు, వైద్యశాలలు, ఏర్పాటు చేయాలని కోరారు. చైర్మన్ సానుకూలంగా స్పందించడంతో పాటు గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి సహకరిస్తామని హామీ ఇచ్చారు.


ఆర్డీటీ చైర్మన్‌కు వినతి పత్రాన్ని ఇస్తున్న ఎంపీ బస్తిపాటి

హార్టికల్చర్ ఏడీ సెలవు పొడిగింపు

కర్నూలు కల్చరల్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ పరిధిలో పనిచేస్తున్న హార్టికల్చర్ అసిస్టెంట్ డైరెక్టర్ విజయలక్ష్మి తన సెలవును పొడిగించాలని ఆ శాఖ డైరెక్టర్‌కు లేఖ రాశారు. ఈమేరకు శాఖ రాష్ట్ర డైరెక్టర్ నుంచి ఏడీ సెలవుపై కమిషనర్‌కు బుధవారం లేఖ వచ్చింది. ఇందులో ఏడీ విజయలక్ష్మి ఆగస్టు 20 నుంచి సెప్టెంబరు 19 వరకు సెలవులో ఉన్నట్లు పేర్కొన్నారు. అయితే సెలవు పూర్తి అయ్యాక ఏడీ విధుల్లో చేరారా ? లేదా అనే విషయాన్ని తెలపాలని రాష్ట్ర డైరెక్టర్ కమిషనర్‌ను కోరారు. ప్రస్తుతం ఏడీ విజయలక్ష్మి మాతృ సంస్థకు వెళ్తున్నట్లు సమాచారం. ఆమె స్థానంలో మరొకరు వచ్చేందుకు ప్రయత్నం చేస్తున్నట్లు తెలిసింది.

క్రీడల్లో రాణించాలి

సి.బెళగల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని హెచ్ఎం నిర్మలా వసంతకుమారి అన్నారు. మండలంలోని బురాన్‌దొడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు ఖోఖో, రబ్బీ, సైక్లింగ్ పోటీల్లో ప్రతిభ చూపారు. ఈ సందర్భంగా పాఠశాల కమిటీ చైర్మన వెంకటేశ్వర్లుతో కలిసి విద్యార్థులను, వ్యాయామ ఉపాధ్యాయుడిని సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

యువత సద్వినియోగం చేసుకోవాలి

కర్నూలు స్పోర్ట్స్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): యువత ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సెట్కూరు సీఈవో దీప్తి అన్నారు. బుధవారం సిల్వర్ జూబ్లీ కళాశాల, కేవీఆర్ డిగ్రీ కళాశాలలో సెట్కూరు-యువజన సంక్షేమ శాఖ జిల్లా ఉపాధి కల్పన కార్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ అగ్నివీర్ వాయు పోస్టుల ఎంపికపై అవగాహన సదస్సు నిర్వహించారు. సికింద్రాబాదు కార్పొరేట్ ఆఫీసర్స్ సందీప్, సురేందర్ సింగ్ మాట్లాడుతూ అగ్నిపత్, అగ్నివీర్ వాయు ఎంపికకు ఇంటర్మీడియట్ విద్యార్హత ఉండాలన్నారు. ఆన్‌లైన్ పరీక్ష ఎంపిక ఉంటుందని పాసైన వారికి దేహధారుడ్యం, ఆరోగ్య పరీక్షలు ఉంటాయన్నారు. మొదటి సంవత్సరం జీతం రూ.30వేలు, రూ.33వేలు, రూ.36,500లు, రూ.40వేలు వరుసగా వేతనం చెల్లిస్తారనీ తెలిపారు. ప్రభుత్వ కార్పస్ ఫండ్ రూ.11.50 లక్షలు చెల్లిస్తారనీ, ప్రభుత్వ శాఖలో ఉద్యోగాలకు రిజర్వేషన్ ఉంటుందన్నారు. అనంతరం సెట్కూరు సీఈవో దీప్తి మాట్లాడుతూ భారత త్రివిధ దళాలు ఆర్మీ, వాయుసేన, నావికదళాల్లో ఎంపిక నిర్వహిస్తారనీ తెలిపారు. ఈ అవకాశాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్య కుమార్, ఎంప్లాయిమెంట్ అధికారి సోమశివారెడ్డి, కేవీఆర్ ప్రిన్సిపాల్ దేవికారాని, ఒకేషనల్ కాలేజి ప్రిన్సిపాల్ నాగస్వామి నాయక్, కోఆర్డినేటర్ బాషా, సెట్కూరు సిబ్బంది శ్యాంబాబు, సింగ్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ భూముల బహిరంగ వేలం : ఈవో

కల్లూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కల్లూరులోని ఈశ్వర, వీరభద్ర భీమేశ్వరస్వామి ఆలయ భూమిని వేలం వేయనున్నట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి గుర్రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కల్లూరు గ్రామ సర్వే నెంబరు 145, 293లో రెండు ఎకరాల భూమిని దేవదాయశాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్ ఆదేశాల మేరకు బహిరంగ వేలానికి టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. 11 సంవత్సరాల కాలపరిమితితో లీజు మంజూరు చేయడానికి ఈ-టెండర్, సీల్డ్ టెండర్ ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 25న ఉదయం 11 గంటలకు దేవదాయశాఖ ప్రాంతీయ సంయుక్త కమిషనర్ ఆధ్వర్యంలో వేలం జరుగుతుందన్నారు. దేవస్థానం పేరుతో రూ.లక్ష సెక్యూరిటీ డిపాజిట్ డీడీ రూపంలో చెల్లించాలన్నారు. మరిన్ని వివరాలకు కార్యాలయంలో సంప్రదించాలని ఈవో కోరారు.

నివాస ప్రాంతాల్లో మద్యం షాపులను నియంత్రించాలి

● డీసీకి ఐద్వా, ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ వినతి

కర్నూలు అర్బన్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): జిల్లాలో జనావాసాల మధ్య మద్యం షాపులను నియంత్రించాలని ఐద్వా, ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం నగరంలోని ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ శాఖ డిప్యూటీ కమిషనర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఐద్వా సీనియర్ నాయకురాలు నిర్మల, కార్యదర్శి అలివేలమ్మ, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అబ్దుల్లా, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్ర, అరుణ, ధనలక్ష్మి, సుజాత, శ్యామల, రంగప్ప, హుస్సేన్ బాషా పాల్గొన్నారు.

సౌండ్ పొల్యూషన్‌పై స్పెషల్ డ్రైవ్

కర్నూలు క్రైం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : నగరంలో అధిక శబ్దాలు చేస్తూ ద్విచక్ర వాహనాలు నడుపుతుండటంతో ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. కేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలో సీఐలు నాగరాజురావు, మన్సూరుద్దీన్ తనిఖీలు చేసి సౌండ్ పొల్యూషన్ పరికరాలను ఉపయోగించే అధిక శబ్దాలు చేస్తున్న రెండు ద్విచక్ర వాహనదారులపై కేసులు నమోదు చేశారు. అలాగే మైనర్లు, ట్రిపుల్ డ్రైవింగ్‌లపై కేసులు నమోదు చేశారు.

లాభాపేక్ష లేకుండా పేదలకు సేవ చేయండి



నీట్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థిని అభినందిస్తున్న కలెక్టర్ పి.రంజిత్ బాషా

కర్నూలు కలెక్టరేట్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): భావి వైద్యులుగా లాభాపేక్ష లేకుండా పేదలకు సేవ చేయాలని, వైద్య రంగంలో పరిశోధనలతో సరికొత్త వైద్యపద్ధతులను కనిపెట్టాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో చిన్నటేకూరులోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల కళాశాల ఐఐటీ మెడికల్ అకాడమి ద్వారా శిక్షణ పొంది నీట్‌లో మెడికల్ సీటు సాధించిన విద్యార్థులను, అందుకు కృషి చేసిన అధ్యాపకుల బృందాన్ని కలెక్టర్ అభినందించారు. విద్యార్థులందరిని శాలువతో సత్కరించి పెన్స్‌ను బహుమతిగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్తులో వైద్యులుగా సమాజానికి సేవ చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీసీవో శ్రీదేవి, ప్రిన్సిపల్ ప్రత్యూష, ఉమ కుమారి, ఉమామహేశ్వరరావు, చంద్రశేఖర్, శోభారాణి, బోధన సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హోల్‌సేల్ మార్కెటింగ్ కల్పించాలి

జిల్లాలో స్వయం సహాయక సంఘాల మహిళలు తయారు చేసే ఉత్పత్తులకు హోల్ సేల్ మార్కెటింగ్ కల్పించాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా డీఆర్‌డీఏ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్లో స్వయం సహాయ సంఘాల ఉత్పత్తులకు మార్కెటింగ్ కల్పించే అంశంపై కలెక్టర్ అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎస్‌హెచ్‌జీ మహిళలు తయారు చేసిన ఉత్పత్తులకు మార్కెటింగ్ కల్పించే అంశంపై చిత్తశుద్ధితో పని చేయాలన్నారు. ఉత్పత్తులకు వ్యాపార అవకాశాలు పెరిగే విధంగా లోకల్ మార్కెట్‌లో లింక్ ఆఫ్ చేయాలన్నారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, సీపీవో హిమప్రభాకర్ రాజు, అధికారులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఏపీఆర్ఎస్ఏ నాయకులు

కలెక్టరేట్‌లో కలెక్టర్ పి.రంజిత్ బాషా, జాయింట్ కలెక్టర్ డా.బి.నవ్యను బుధవారం ఏపీఆర్ఎస్ఏ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు నాగరాజు, జిల్లా కార్యదర్శి లక్ష్మిరాజు, స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ రజనీకాంత్ రెడ్డి, కలెక్టరేట్ ప్రెసిడెంట్ వెంకట్రాజు, కర్నూలు డివిజన్ ప్రెసిడెంటు రామాంజనేయులు, జిల్లా కార్యవర్గ సభ్యులు లోకేశ్వరి, కృష్ణవేణి, శివపార్వతి, భాను తదితరులు పాల్గొన్నారు.

పాము కాటుపై అవగాహన అవసరం

కర్నూలు అర్బన్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): పాములపై, పాము కాటుపై అవగాహన కలిగి ఉండాలని సంఘమిత్ర అనిమల్ ఫౌండేషన్ సభ్యుడు మహమ్మద్ ఇద్రిస్ అన్నారు. బుధవారం నగర శివారులోని కేంద్రీయ విద్యాలయంలో టీచర్లకు పాముకాటుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయలసీమలో పలు చోట్ల విద్యార్థులకు, ప్రజలకు పాములపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. పాము కనపడగానే ముందుగా అక్కడి నుంచి దూరం వెళ్లి పోవాలని, రాత్రి పూట తప్పక టార్చ్‌లైట్‌ని వాడాలని సూచించారు. రాష్ట్రంలో కేవలం నాలుగు జాతుల పాములు మాత్రమే విషపూరితమైనవన్నారు. మిగిలినవాటికి విషం ఉండదని అందువల్ల వాటిపై అవగాహన పెంచుకోవడం అవసరమని తెలిపారు. పాము కాటుకు గురి ఐతే ఆలస్యం చేయకుండా ప్రభుత్వ ఆసుపత్రికివెళ్లాలని సూచించారు. ఈకార్యక్రమంలోప్రిన్సిపల్ పాయల్ ప్రియదర్శిని, టీచర్స్ అండ్ స్టాఫ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన సదస్సు

కర్నూలు ఎడ్యుకేషన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆత్మకూరు రోడ్డులోని సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో బుధవారం మీకోసం పోలీసు శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. సీఐ విజయలక్ష్మి మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలు విధిగా పాటించాలన్నారు. అలాగే పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ రాజమ్మ, ఎస్ఐ ప్రేమ, కానిస్టేబుల్ పుల్లమ్మ, ప్రిన్సిపాల్ విజయసూరి, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గూడు పురుగును నివారించుకోవాలి

కోడుమూరు రూరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కంది పంటను ఆశించిన గూడుపురుగు నివారణకు చర్యలు తీసుకోవాలని ఏడీఏ సాలురెడ్డి సూచించారు. అమడగుంట్ల గ్రామంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఏడీఏ, జిల్లా వనరుల కేంద్ర ఏడీఏ వెంకటేశ్వర్లు, ఏవో శశిధర్‌రెడ్డి, డాట్ సెంటర్ సైంటిస్ట్ కిషోర్‌కుమార్, వ్యవసాయాధికారి రవిప్రకాష్, సర్పంచ్ వరలక్ష్మి సిబ్బంది రఘునాథ్ పాల్గొన్నారు.

గూడూరు: గూడూరులో మండల వ్యవసాయ అధికారి శ్రీవర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం పోలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా కర్నూలు సబ్ డివిజన్ ఏడీఏ సాలు రెడ్డి, డీఆర్‌సీ ఏడీఏ వెంకటేశ్వర్లు, కర్నూలు డాట్ సెంటర్ శాస్త్రవేత్త రవి కిశోర్, డీఆర్‌సీ ఏడీ శశిధర్ కంది పంటను పరిశీలించి రైతులకు సలహాలు, సూచనలు అందించారు. కార్యక్రమంలో ఏఈవోలు లక్ష్మీనారాయణ, శ్రీవాణి, ఎంపీఈవోలు, రైతులు పాల్గొన్నారు.

గ్రామ సభల్లో సమస్యలు పరిష్కారం

గూడూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): గ్రామ సభల్లో రైతుల సమస్యలు పరిష్కారమవుతాయని జాయింట్ కలెక్టర్ నవ్య అన్నారు. బుధవారం గూడూరు మండలం కె నాగలాపురం గ్రామంలో రీ సర్వేలో వచ్చిన భూ సమస్యలు పరిష్కార కార్యక్రమం గ్రామసభ నిర్వహించారు. 29 ఫిర్యాదులను అధికారులు స్వీకరించారు. గ్రామ సభల్లో తహసీల్దార్ రామాంజనేయులు, సర్పంచ్ జె.నయోమి, రీ సర్వే డీటీ లోకేశ్వర రెడ్డి, మండల సర్వేయర్ బాలు నాయక్, రైతులు పాల్గొన్నారు.

కల్లూరు: మండల పరిధిలోని కొంగనపాడులో నిర్వహించిన గ్రామసభలో 91 అర్జీలను స్వీకరించినట్లు తహసీల్దారు కె.ఆంజనేయులు తెలిపారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ శ్రీనివాసులు, టీడీపీ నాయకుడు బెస్తసారథికార సంస్థ జిల్లా కార్యవర్గ సభ్యుడు వినోద్‌కుమార్, మాజీ సర్పంచులు నాగయ్య, గోరంట్ల, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఓర్వకల్లు: మండలంలోని హుశేనాపురం గ్రామంలో బుధవారం సర్పంచ్ చంద్రగోవర్ధనమ్మ అధ్యక్షత గ్రామ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా రెవెన్యూ అధికారులు రైతుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ విద్యాసాగర్, డిప్యూటీ తహసీల్దార్ షర్మిళారెడ్డి, సర్వేయర్ శంకర్‌శర్మ, ఈవోఆర్‌డీ సుబ్బరాయుడు, వీఆర్వో మౌలిబాషా, టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్, నాయకులు చంద్రపెద్ద స్వామి సుధాకర్, రామగోవిందు, జయకృష్ణ, షమీవుల్లా, శేఖరప్ప, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.


కొంగనపాడులో రైతుల నుంచి అర్జీ స్వీకరిస్తున్న కల్లూరు తహసీల్దారు కె. ఆంజనేయులు

కోడుమూరు రూరల్: రీసర్వేలో జరిగిన తప్పిదాలను సరిదిద్దుటకే గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ వెంకటేశ్‌నాయక్ తెలిపారు. బుధవారం ముడుమలగుర్తిలో గ్రామసభ నిర్వహించారు. మొత్తం 62 మంది రైతుల నుంచి అర్జీలను స్వీకరించినట్లు తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో రీసర్వే డీటీ క్రిష్ణమూర్తి, మండల సర్వేయర్ సునీల్ వీఆర్వోలు నారాయణ, శ్రీనివాసులు, దస్తగిరి పాల్గొన్నారు.

మురుగు నీరు కలవకుండా చర్యలు

కర్నూలు కల్చరల్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): నగరంలో ప్రవహిస్తున్న కేసీ కెనాల్ కాలువలో మురుగునీరు కలవకుండా మళ్లించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. బుధవారం జల వనరుల శాఖ అధికారులతో కలిసి నగరపాలక అధికారులు కేవీఆర్ కళాశాల, విద్యుత్ శాఖ కార్యాలయం, ధర్మపేట రైల్వే బ్రిడ్జి, స్టాంటన్‌పురం ప్రాంతాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఈఈ సత్యనారాయణ, డీఈ మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు.

సమగ్ర యజమాన్య పద్ధతులు పాటించాలి

ఓర్వకల్లు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): సమగ్ర యాజమాన్య పద్ధతులతో చీనితోటల్లో అధిక దిగుబడులు సాధించవచ్చని ఏవో సుధాకర్ అన్నారు. బుధవారం కొమరోలు గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. సర్పంచ్ రామచంద్రుడు, ఏఈ వోలు భాస్కర్, మధు, రైతులు భాస్కర్ రెడ్డి, పుల్లారెడ్డి, మహేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సి. బెళగల్: సేంద్రీయ ఎరువులతో అధికలాభాలు సాధించవచ్చని వ్యవసాయఅధికారి మల్లేష్‌కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని బురాన్‌దొడ్డిలో పొలం పిలుస్తోంది కార్యక్రమన్ని నిర్వహించారు.ఎంపీవోలు సిద్దు, వెంకటేశ్వర్లు, మారెప్ప ఉన్నారు.

సి. బెళగల్‌కు నేడు ఎమ్మెల్యే రాక

సి. బెళగల్, అక్టోబరు 23 ఆంధ్రజ్యోతి: కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి గురువారం సి. బెళగల్ మండల కేంద్రానికి రానున్నారు. మండల పరిషత్ కార్యాలయం ఆవరణంలో ప్రజా వేదిక కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.

కలెక్టర్‌ను కలిసిన మహేష్ నాయుడు


కలెక్టర్‌కు పూల మొక్కను అందజేస్తున్న మహేష్ నాయుడు

కర్నూలు కలెక్టరేట్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ కార్యాలయంలో బుధవారం ఆంధ్రప్రదేశ్ సివిల్ సప్లయ్ కార్పొరేషన్ డైరెక్టర్ తలముడిపి మహేష్ నాయుడు కలెక్టర్ పి.రంజిత్ బాషాను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సత్కరించి పూలమొక్కను అందజేశారు.

విద్యార్థినికి ఆర్థిక సాయం

దేవనకొండ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఎనిమిదో తరగతి విద్యార్థిని కౌసర్‌భాను క్యాన్సర్‌తో బాధపడుతోంది. విద్యార్థిని చదువుతున్న సర్వస్వతి పాఠశాల ఉపాధ్యాయులు రూ.15వేలు ఆర్థిక సహాయం అందజేశారు.

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు: జేడీ

హాలహర్వి, అక్టోబరు 23, (ఆంధ్రజ్యోతి): ఎరువులు, మందులు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని జేడీఏ వరలక్ష్మి హెచ్చరించారు. ఆమె బుధవారం గూళ్యంలో పురుగు మందుల దుకాణాలను తనిఖీ చేశారు. అయితే జెడీ వస్తున్నారన్న సమాచారం వ్యాపారులు తెలుసుకున్న దుకాణాదారులను మూసివేయగా, కేవలం రెండు దుకాణాలు మాత్రమే తెరచివున్నాయి. వ్యవసాయ అధికారులే సమాచారం ఇచ్చారని ప్రజలు అరోపిస్తున్నారు.

సులభ్ కాంప్లెక్స్ నిర్మించాలి

పత్తికొండ టౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద సులబ్ కాంప్లెక్స్ నిర్మించాలని సీపీఎం జిల్లా నాయకులు వీరశేఖర్, దస్తగిరి, గోపాల్ డిమాండ్ చేశారు. బుధవారం తహసీల్దార్ రమేష్‌కు వినతి పత్రం ఇచ్చారు. బస్ షెల్టర్ పక్కన ఖాళీ స్థలంలో సులబ్ కాంప్లెక్స్‌ను నిర్మించాలని అన్నారు. ప్రజానాట్య మండలి నాయకులు కాశీనాథ్, కాశీ పాల్గొన్నారు.

భూసమస్యల పరిష్కారానికే గ్రామసభలు

ఆలూరు, అక్టోబరు 23, (ఆంధ్రజ్యోతి): రీ-సర్వే పూర్తయిన గ్రామాల్లో భూ-సమస్యల పరిష్కారానికై కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రామ సభలు నిర్వహిస్తున్నామని తహసీల్దార్ గోవింద్ సింగ్ అన్నారు.. బుధవారం మరకట్టు గ్రామం సభల్లో అర్జీలు స్వీకరించారు. సర్పంచ్ ఎల్లప్ప, సర్వేయర్ అరుణజ్యోతి, వీఆర్వో రవి, రైతులు పాల్గొన్నారు.

భూ సమస్యలను పరిష్కరించుకోండి

హొళగుంద, అక్టోబరు 23, (ఆంధ్రజ్యోతి): రీ-సర్వేతో ఇబ్బంది పడుతున్న రైతులు భూ సమస్యలను పరిష్కరించుకోవాలని తహసీల్దార్ సతీష్ అన్నారు. బుధవారం ముద్దటామాగి గ్రామంలో గ్రామసభ నిర్వహించారు. రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. డీటీ నిజాముద్దీన్, రీ సర్వే డీటీ ముకుంద రావు, వీఆర్వోలు సూరంజి నేయులు, నాగరాజు, ప్రహలాద్ పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ప్రశాంతత



ట్రోఫీ అందుకుంటున్న పోలీసు టీం

- ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు
- పత్తికొండలో క్రికెట్ టోర్నమెంట్

పత్తికొండ, అక్టోబరు 23 : క్రీడలతో మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు అన్నారు. పోలీసు అమర వీరుల వారోత్సవాల సందర్భంగా పత్తికొండలో డీఎస్పీ వెంకట్రామయ్య ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. పోలీసులు, న్యాయవాదులు, ఉద్యోగులు, పాత్రికేయుల టీంలు పాల్గొన్నాయి. ముందుగా పోలీసు- వైద్యశాఖ టీంలు తలపడగా పోలీసు టీం విజయం సాధించింది.

అనంతరం న్యాయ వాదులు, జర్నలిస్టుల తలపడగా జర్నలిస్టు టీం గెలిచింది. ఫైనల్ మ్యాచ్‌లో జర్నలిస్టులు, పోలీసులు తలపడ్డారు. ఇందులో పోలీసుల గెలవగా, జర్నలిస్టులు రన్నర్స్‌గా నిలిచారు. న్యాయాధికారి ఎంఎస్ బారతి, ఆర్డీవో భరత్‌నాయక్, జిల్లా డ్రగ్ అధికారి షేక్‌పర్వీన్, ట్రైనీ డీఎస్పీ ఉషశ్రీ, వైద్యాధికారి కల్పన, పీఈటీలు రాజేష్‌గోల, చందునాయక్, తెలుగు యువత రాష్ట్రనాయకుడు బత్తిన లోక్‌నాథ్, బార్ అసోసియోషన్ అధ్యక్షుడు రంగస్వామి సీఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

చేతి వృత్తిదారులను ఆదుకోవడంలో ప్రభుత్వాలు విఫలం

ఆస్పరి, అక్టోబరు 23, (ఆంధ్రజ్యోతి): చేతి వృత్తిదారులను ఆదుకోవడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి గిడ్డయ్య ధ్వజమెత్తారు. బుధవారం చేతివృత్తిదారుల జిల్లా సదస్సు నిర్వహించారు. సదుపాయాలు కల్పించాలని, యంత్రాలు అందించాలని డిమాండ్ చేశారు. రామాంజనేయులు, లింగమయ్య విరుపాక్షి, రాజశేఖర్, నరసింహులు, పురుషోత్తం, రమేష్ పాల్గొన్నారు.

కుక్కల నియంత్రణకు చర్యలు

ఆలూరు, అక్టోబరు 23, (ఆంధ్రజ్యోతి): పట్టణంలో వీధి కుక్కల సంతానోత్పత్తి నియంత్రణకు చర్యలు తీసుకోవాలని అధికారులను కోరామని పంచాయతీ ఈవో ప్రభాకర్ బుధవారం తెలిపారు. కాలువల్లో బ్యాక్టీరియా నియంత్రణకు చేపలు వదులుతున్నామన్నారు.

చర్యలు తీసుకోవాలి

ఆదోని టౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో నిబంధనలు పాటించకుండా నిర్మించిన ప్రైవేట్ ఆసుపత్రుల పై చర్యలు తీసుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కునిగిరి నీలకంఠ డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని ప్రైవేట్ ఆసుపత్రులను పరిశీలించారు. అనుమతి లేకుండా అదనపు అంతస్తులు నిర్మించారని, రోగులకు సరైన గాలి వెలుతురు అందడం లేదని అన్నారు. చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులను సంప్రదించనున్నట్లు నీలకంఠ తెలిపారు.





రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

ఆదోని (అగ్రికల్చర్), అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థినులు ఎస్‌జీఎఫ్ అండర్-19 రాష్ట్ర స్థాయి క్రీడాపోటీలకు రజని, పవిత్ర, సునీత్, లక్ష్మి, సురేఖ, ఇందు, సౌమ్యశ్రీ ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ సంజన్న తెలిపారు. క్రీడలతో పాటు చదువు ముఖ్యమన్నారు. అధ్యాపకులు చిట్టి ప్రసాద్, గోవింద రాజులు, దేవతి పాల్గొన్నారు.





మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



మాట్లాడుతున్న మాజీ జడ్పీటీసీ పురుషోత్తం చౌదరి

మద్దికెర, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని మాజీ జడ్పీటీసీ పి.పురుషోత్తం చౌదరి సూచించారు. బుధవారం పెరవలి జడ్పీ పాఠశాలలో అంతర్జాతీయ బాలికల దినోత్సవం నిర్వహించారు. ప్రభుత్వం బాలికా విద్యను ప్రోత్సహిస్తుందని, ఇంటిలో ఆడపిల్ల ఉంటే కళకళలాడుతుందన్నారు. నేడు మహిళలు అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్నారని, విద్యార్థినులను, మహిళలను కించపరిస్తే ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు. హెచ్ఎం రంగస్వామి పాల్గొన్నారు.



గ్రామాల అభివృద్ధే ధ్యేయం : ఎమ్మెల్యే




సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు

తుగ్గలి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధే టీడీపీ ధ్యేయమని పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు అన్నారు. బుధవారం తుగ్గలిలో రూ.25 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు, మురుగు కాలువలను టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి తుగ్గలి నాగేంద్రతో కలిసి ప్రారంభించారు. ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టలేదని, రోడ్లన్నీ గుంతలమయయ్యాన్నారు. టీడీపీ ప్రభుత్వం ఏర్పాటైన మూడు నెలల్లోనే గ్రామాల్లో రోడ్లు, డ్రైనేజీ నిర్మిస్తున్నామన్నారు. 2014-2019లో గత టీడీపీ ప్రభుత్వం సీసీ రోడ్లు వేసిందన్నారు. సీఎం చంద్రబాబుకు అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లని తెలిపారు. మనోహర్ చౌదరి, తిమ్మయ్య చౌదరి, మిద్దె వెంకటేశ్ యాదవ్, వెంకట్‌స్వామి, వెంకటేశ్వర్లు, శివరాముడు చౌదరి, సర్పంచ్ రవి, విజయ్ భాస్కర్, గిరిగిట్ల మల్లి, రాముడు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

సమస్యలు ఏవైనా పరిష్కరించాలని పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు అధికారులకు సూచించారు. బుధవారం తుగ్గలిలో ఎమ్మెల్యే పర్యటించి ప్రజా సమస్యలను తెలుసుకున్నారు. ఎంపీడీవో విశ్వమోహన్, ఏపీవో హేమసుందర్, మనోహర్ చౌదరి, లక్ష్మినారాయణ చౌదరి, ఈశ్వర్‌రెడ్డి, మిద్దె వెంకటేశ్ యాదవ్, వెంకట్రాముడు చౌదరి, శ్రీను నాయక్, సత్య పాల్గొన్నారు.





రైతు సంక్షేమానికి కృషి: జేడీ



జింకల సమస్యపై జేడీతో మాట్లాడుతున్న నారాయణ రెడ్డి

ఆలూరు రూరల్, అక్టోబరు 23, (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని వ్యవసాయశాఖ జేడీ వరలక్ష్మి అన్నారు. బుధవారం ఆలూరుకు వచ్చిన ఆమెను జింకల సమస్య పరిష్కరించాలని టీడీపీ రాష్ట్ర రైతు కమిటీ కార్యదర్శి నారాయణ రెడ్డి కోరారు. జేడీ మాట్లాడుతూ జింకల సమస్య పరిష్కారానికి ప్రభు త్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. జింకల పార్కు అధ్యయనానికి ఆలోచన చేస్తున్నట్లు తెలిపారు. అలాగే రైతులకు ఎరువులు, మందులు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లాలో మరలా వర్షాలు కురిసే అవకాశం ఉందని, శనగ విత్తనం వేసే రైతులు విరామం ఇవ్వాలని సూచించారు. ఆర్బీకే ద్వారా సలహాలు, సూచనలు, సేవలు అందిస్తున్నామని జేడీ అన్నారు. ఏడీఏ సునీత, ఏవో వెంకటేశ్వర గౌడ్ పాల్గొన్నారు.

విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో నష్టం

మద్దికెర, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో లో వోల్టేజీ వస్తుందని, మోటార్లు కాలిపోతున్నట్లు సభ్యులు ధ్వజమెత్తారు. బుధవారం ఎంపీపీ బి.అనితా యాదవ్ అధ్యక్షతన మండల సమావేశం నిర్వహించారు. బొమ్మనపల్లి సర్పంచ్ ఆంజనేయులు, వైస్ ఎంపీపీ మహేశ్వరరెడ్డి, ఎంపీటీసీఊ రామకృష్ణారెడ్డి, కాల్వ రామకృష్ణ మాట్లాడుతూ మూడు రోజులుగా విద్యుత్ కోతలు వేధిస్తున్నాయన్నారు. జడ్పీటీసీలు మురళీధర్ రెడ్డి, ఎంపీడీవో సీవీ కొండయ్య, సర్పంచులు బండారు సుహాసిని, విజయుడు, మల్లికార్జున, వైద్యాధికారి రాగిణి, పశువైద్యాధికారి కృష్ణ నాయక్, హౌసింగ్ ఏఈ ఉమాకాంత్, ఏవో రవి, కార్యదర్శులు ఉన్నారు.





ఆర్థిక మంత్రిని కలిసిన ఎమ్మెల్యే బీవీ

ఎమ్మిగనూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో బుధవారం ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి ఆర్థిక, మంత్రి పయ్యావుల కేశవ్‌ను కలిశారు. ఎమ్మిగనూరు నియోజకవర్గ అభివృద్ధికి నిధులు కేటాయించాలని మంత్రిని కోరినట్లు ఎమ్మెల్యే బీవీ తెలిపారు. శాప్ చైర్మన్ అనిమిని రవినాయడును కలిసి ఎమ్మిగనూరు నియోజకవర్గంలో క్రీడాభివృద్ధికి నిధుల కేటాయింపుపై చర్చించారు.



మంత్రి కేశవ్‌తో ఎమ్మెల్యే బీవీ

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, పీఈటీలు

ఎమ్మిగనూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): తమ పాఠశాల విద్యార్థులు జాతీయ పవర్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపికైనట్లు కరస్పాండెంట్ హేబేల్ బుధవారం తెలిపారు. పదో తరగతి చదువుతున్న ఏఎండీ ఫైజల్, వంశీ ప్రతిభచాటి జాతీయ స్థాయికి అర్హతసాధించారు. ప్రిన్సిపల్, పీఈటీలు, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

రీసర్వే తప్పులను సరిచేస్తాం

- సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్



అర్జీలను స్వీకరిస్తున్న సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

కోసిగి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం చేసిన రీసర్వేలో తప్పులను సరి చేస్తామని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ అన్నారు. బుధవారం కోసిగిలోని 4వ వార్డు చౌడేశ్వరి కళ్యాణ మండపంలో పెండేకల్లుకు చెందిన పొలాల సమస్యల గురించి సబ్ కలెక్టర్ రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. నవంబరు వరకు రీసర్వే చేసిన గ్రామాల్లో గ్రామసభలు నిర్వహిస్తున్నామని రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. రైతులకు నూతన పాసు పుస్తకాలు ఇస్తామని అన్నారు. తహసీల్దార్ నిత్యానందరాజు, డీటీ రుద్రగౌడు, ఆర్ఐ శ్రీరాములు, సీనియర్ అసిస్టెంట్ తిక్కస్వామి, వీఆర్వోలు, సర్వేయర్లు పాల్గొన్నారు.

అభివృద్ధికి నిధులు కేటాయించాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో మణిమంజరి

గోనెగండ్ల, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలో సీసీరోడ్లు డ్రైనేజి పనులకు గాను మరో రూ. 20 కోట్లు కేటాయించాలని కోరుతూ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు పీఆర్ ఏఈ శివశంకర్ తెలిపారు. బుధవారం ఎంపీడీవో సమావేశం భవనంలో మండల సభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీపీ నసూరుద్దీన్ అధ్యక్షత వహించారు. మండలంలో రూ.2కోట్లతో 16 ఉపాధి పనులు చేస్తున్నట్లు, నాలుగు పనులు పూర్తి అయ్యాని తెలిపారు. జనవరి లోపు మిగతా పనులు పూర్తి చేస్తామని అన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ తాగునీటి సమస్య తీర్చేందుకు గోనెగండ్లతో పాటు వేముగోడు, తిప్పనూరు, బోదేపాడు, కున్నూరు, కులుమాల, గుల్లమరును, గ్రామాలకు జలజీవన్ మిషన్ కింద నిధులు మంజూరయ్యాయని కొన్ని గ్రామాలలో పనులు చేస్తున్నామన్నారు. అగ్రహారం, బైలుప్పల, గంజహళ్లి గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కరించేందుకు రూ.13 కోట్లు నిధులను ప్రభుత్వ విడుదల చేయాలని కోరుతూ ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. వైద్యులు కార్తీక్ మట్లాడుతూ అంటువ్యాధులు ప్రబలే సీజన్ కావడంతో పరిసరాలను పరిశు భ్రంగా ఉంచుకోవాలని, దోమలు ఈగల నివార ణకు పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఏవో హేమలత, ఎంఈవో రామాంజినేయులు, ఉపాధి ఏపీఎం మహబూబూబ్ బాషా, ఎంపీడీవో మణిమంజరి, అధికారులు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

భర్త ఇంటి ఎదుట బైఠాయింపు

ఎమ్మిగనూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): తనకు భర్త, పిల్లలు, సంసారం కావాలని కోరుతూ భర్త సాధిక్ వలి ఇంటి ముందు భార్య తస్మీన్ బుధవారం బైఠాయించింది. బాధితురాలి కథనం మేరకు.. గోనెగండ్లకు చెందిన తస్మీన్‌ను ఎమ్మిగనూరుకు చెందిన సాధిక్ వలికి ఇచ్చి వివాహం చేశారు. వీరికి ముగ్గురు పిల్లలు. పదేళ్ల వరకు సంసారం సాఫీగానే సాగుతూ వచ్చింది. అయితే కొంతకాలం నుం అదనపు కట్నం తేవాలని భర్త వేధిస్తున్నాడని తెలిపింది. గతంలో భార్య భర్త మధ్య గొడవలు చోటుచేసుకున్న సమయంలో కుటుంబ సభ్యులు సర్ధిచెప్పేవారు. కొన్ని రోజుల నుంచి వారు కూడా దుర్భాషలాడుతూ ఇబ్బందులకు గురిచేస్తున్నారు. భర్త సాధిక్ వలి పిల్లలను తీసుకొని తనను పంపివేశారు. దీంతో చేసేది లేక పుట్టింటికి చేరింది. దీన్ని అదనుగా తీసుకున్న సాధిక్ వలి మరో పెళ్లికి సిద్ధం కావటంతో విషయం తెలుసుకున్న తస్మీన్ భర్త ఇంటి ముందు బైఠాయించింది. విషయం తెలుసుకున్న మహిళాసంఘాల నాయకులు సంఘీభావం తెలిపారు. తస్మీన్‌కు న్యాయం చేయాలని కోరారు.



భర్త ఇంటి ముందు బైఠాయించిన భార్య తస్మీన్





రీసర్వే రైతుల భూ సమస్యలు పరిష్కరిస్తాం

మంత్రాలయం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రీ సర్వే రైతుల భూ సమసల్యను పరిష్కరిస్తామని రవి, డీటీ గురురాజరావు అన్నారు. బుధవారం వగరూరు గ్రామంలో రెవెన్యూ గ్రామ సభలు నిర్వహించారు. 145 రైతులు పిర్యాదులను అందజేశారు. తహసీల్దార్, డీటీలు మాట్లాడుతూ రీసర్వేలో భూముల కొలతలు, ఆన్‌లైన్ అడంగల్ నమోదు, మ్యాపింగ్ లోపాలను సరిచేస్తామన్నారు. ప్రతి దరఖాస్తును పరిశీలించి, రైతులకు ఆమోదయోగ్యకరకమైన పరిష్కారాన్ని చూపిస్తామని తెలిపారు. ఆర్ఐ ఆదాం, మండల సర్వేయర్ అశోక్, వీఆర్వో శ్వేత పాల్గొన్నారు.

వసుధేంద్రతీర్థుల ఆరాధన మహోత్సవాలు

మంత్రాలయం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): శ్రీమఠం పూర్వ పీఠాధితి వసుధేంద్రతీర్థుల ఆరాధన మహోత్సవాలు బుధవారం నిర్వహించారు. శిరిగుంప సమీపంలో పెంచనగుడ్డలో వెలసిన వసుధేంద్రతీర్థుల బృంధావనానికి ప్రత్యేక పూజలు చేసి హారతులు ఇచ్చారు. అక్కడే మూల రాములకు కనకాభిషేకం చేసి భక్తులకు సప్తముద్రధారణ చేశారు. సీసీ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే నాగరాజతో కలిసి రోడ్డుకు భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. బళ్లారి ఎస్పీ శోభారాణి, ప్రకాషాచార్, ద్వారపాలక అనంతస్వామి, వరధేంద్రాచార్ తదితరులు పాల్గొన్నారు.

మూగలదొడ్డిలో రోడ్డేశారు..!

ఆంధ్రజ్యోతి కథనంతో నెరవేరిన 15 ఏళ్ల కల



రోడ్డుకు గ్రావెల్ వేసి బాగు చేస్తూ..

కోసిగి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మూగలదొడ్డి గ్రామంలో బురద రోడ్డును బాగు చేశారు. ఈ నెల 19న ఆంధ్రజ్యోతి దిన పత్రికలో 'నడకయాతన' శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన పంచాయతీ కార్యదర్శి అనురాధ, సర్పంచ్ కురువ శివలింగమ్మ ఆధ్వర్యంలో డ్రైనేజీ కాలువలకు పైపులైన్లు వేసి గరును, మట్టి రోడ్డు వేసి బురద రోడ్డును బాగు చేశారు. త్వరలో పల్లె పండుగలో సీసీ రోడ్డు, డ్రైనేజీ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. 15 ఏళ్ల కలగా మిగిలిపోయిన రోడ్డును ఆంధ్రజ్యోతి కథనం ద్వారా మట్టి రోడ్డు వేయడంతో గ్రామ ప్రజలు ఆంధ్రజ్యోతికి అభినందనలు తెలిపారు.

గ్రామ సభతో రైతు సమస్యల పరిష్కారం




వినతులు స్వీకరిస్తున్న తహసీల్దార్ మహేష్

నందవరం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నిర్వహిస్తున్న గ్రామ సభలతో రైతుల సమస్యలు పరిష్కారమౌతాయని రీ సర్వే తహసీల్దార్ మహేష్, సర్పంచ్ అక్కామాంబ బండేగురుస్వామి తెలిపారు. బుధవారం పూలచింత గ్రామంలో ఆర్ఐ జర్మియా ఆధ్వర్యంలో గ్రామ సభ నిర్వహించారు. రైతుల సమస్యలను 15 రోజుల్లోపు పరిష్కరిస్తామన్నారు. సర్వేయర్ అక్బర్‌బాష, ముగతి శేఖర్, షరీఫ్, బసవ, పాల్గొన్నారు.

కొడుకు ఇంటి నుంచి వెళ్లిపోయాడని ఫిర్యాదు

కోసిగి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతకుంట గ్రామానికి చెందిన లింగారెడ్డి, ముత్తమ్మ దంపతుల మూడో కుమారుడు కాటిగేని నర్సయ్య(17) ఇంటి నుంచి వెళ్లిపోవడంతో తల్లి ముత్తమ్మ తల్లడిల్లిపోతోంది. కొడుకు ఆచూకీ తెలపాలని కనబడిన వారందరినీ అడుగుతోంది. కోసిగి ఎస్ఐ చంద్రమోహన్‌కు తల్లిదండ్రులు పిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. 6305557900, 9618562275 నెంబర్లను సంప్రదించాలన్నారు.



నర్సయ్య(ఫైల్)

గుండెపోటుతో వలస కూలీ మృతి

కోసిగి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని 2వ వార్డుకు చెందిన దుద్ది నర్సారెడ్డి (60) గుండెపోటుతో మృతి చెందాడు. మంగళవారం సాయంత్రం భార్య పిల్లలతో కలిసి కర్ణాటక రాష్ట్రం రాయచూరు జిల్లా సైదాపురం గ్రామానికి వలస వెళ్లాడు. అయితే ఒక్కరోజులోనే బుధవారం సాయంత్రం పొలంలో గుడిసె వేసుకుంటుండగా గుండెపోటుతో కుప్పకూలాడు. ఆసుపత్రికి తరలించగా.. అప్పటికే మృతి చెందాడని వైద్యులు తెలిపారు. మృతునికి భార్య లక్ష్మి, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. మూడేళ్లుగా పత్తి పంటలో నష్టలు వచ్చి రూ.3లక్షల అప్పు చేశాడు. వాటిని తీర్చేందుకు వలస వెళ్లి మృత్యువాత పడ్డాడు. పెద్ద దిక్కు కోల్పోవడంతో భార్య పిల్లలు రోధిస్తున్న తీరు పలువురిని కంటతడి పెట్టించింది.



నర్సారెడ్డి (ఫైల్)